యేసుక్రీస్తు అందరికి ప్రభువు ★

RNI APTEL / 2006 / 17980
Postal Regd.No. Vsp- 142 / 2015-2017

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU

TELUGU FORTNIGHTLY, REGD. NEWS PAPER

POST BOX NO. : 2, OLD DAIRY FARM POST, ADARSHANAGAR,
VISAKHAPATNAM - 530 040. ANDHRA PRADESH, INDIA.
Call : 9346960601, 9490266640.
christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

సంపుటి : 9 సంచిక : 16
ఎడిటర్ : వై.కనకరాజు
2015 జూన్ 1-15 పేజీలు : 8
₹:5

PUBLISHED FROM VISAKHAPATNAM

రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము ★

వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును ★ ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు ★

మర్మగర్భ వివరణలు.. అనేక ప్రశ్నలకు.. సందేహాలకు సమాధానాలు ఒకే చోట!

10వ, సంవత్సరం


'క్రైస్తవనాడు'లో

సంచలనం!

ఆర్టికల్స్‌లో..!

లేఖనాల్లోగల మీకు తెలిసిన మర్మగర్భ సంగతులను ప్రచురించుకునే అవకాశం మీకుంది. సంప్రదించగలరు.. ప్రార్థనలతోను సహకరించగలరు.


- ఎడిటర్




యెహోవా మన శాసనకర్త ★

సర్వసృష్టికి అధిపతి దేవుడని నమ్ముటకు ఆస్తికులకు (దేవుని నమ్మినవారు) ఎటువంటి ఆక్షేపణ ఉండదు. దేవుడే సర్వలోకాలను పాలించువాడని, ఆయన చిత్తమును సృష్టినందున్నవన్నియు నెరవేర్చుచున్నవని సృష్టిని గూర్చి ఆలోచిస్తే తెలుస్తుంది. చరాచర సృష్టి అంతయు ఒక క్రమబద్ధంగా చలించుట ఆలోచించు వారికి బహు ఆశ్చర్యకరమైన సంగతి. వాటిని అంతటి క్రమంలో నడిపే దేవుని శాసనాలెంత ఆశ్చర్యకరమైనవో, ఆయన ఎంతటి ఆశ్చర్యకరుడో సామాన్యుల ఊహకు అందని విషయం. సూర్య, చంద్ర, నక్షత్ర, గ్రహాలలో కొన్ని భూమికంటే అనేక రెట్లు పెద్దవి. అంతటి ఘనమైన వాటిని ఒక క్రమప్రకారం త్రిప్పే దేవుని కట్టడ (శాసనం) మరెంతటి గొప్పదో గదా ! దేవుని గురించి ఆలోచించేటప్పుడు పై విషయాలను గురించి అందరూ జీవితంలో ఒకసారైనా ఆలోచించాలి. అలా ఆలోచించువారు మాత్రమే దేవుని యొక్క సర్వోత్తమత్వాన్ని, ఆయన శాసనాల్ని గ్రహించగలరు.

2



విశ్వాసమే శ్వాస

- సత్యసాయి బాబా



యేసుక్రీస్తు సేవకు ఆటంకులు శరీర స్వస్థతలను కోరుకునే వారే!

- బ్రదర్ పి. సతీష్‌కుమార్
హైదరాబాద్.



మనసులో ప్రేమ పుట్టడానికి ఒక్క నిమిషం చాలు. కాని నిజమైన ప్రేమను మనసులోంచి తుడిచే యాలనుకుంటే ఒక్క యుగం చాలదు.

-నిత్యామీనన్


అర్జంట్ రిక్రూట్

## లేడీ టీచర్స్ కావలెను

విశాఖజిల్లా మజ్జివలస (తగరపువలస దగ్గర)లో ఉన్న ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో పనిచేయుటకు ఆసక్తిగల 'లేడీ టీచర్స్' కావలెను. తక్షణం సంప్రదించగలరు.

ఫోన్స్ : 08933-227533 / 227588

ఆంధ్రప్రదేశ్ NORTH EAST WEST SOUTH తెలంగాణ





## ఇదెలా ముగిసేనో?!


రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య వివాదాలు మంచిది కాదని అభివృద్ధిలో వారు పోటీ పడాలని నాయకులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎమ్మెల్సీకి ముడుపులు ఇస్తున్న వీడియో ఆడియో ఫుటేజీలతో సహా దొరికిపోవడం ఇక్కడి టిడిపి నాయకులు జీర్ణించుకోలేక రకరకాలుగా మాట్లాడుతూ తుదకు గవర్నర్‌పై కూడా నిందలేయుట తగదంటున్నారెందరో! ఈ మాటల చేతల యుద్ధాల వల్ల రెండు రాష్ట్రాల నాయకుల మధ్య ఇంకెన్ని వివాదాలేర్పడాతాయోనన్న ఉత్కంఠ ఆంధ్ర ప్రజల్లోనే ఎక్కువగా ఉందన్నది బహిరంగ రహస్యం. ఇదెలా ముగిసేనో అన్నది తెదేపా అభిమానుల్లో, కార్యకర్తల్లో చర్చలకు దారితీస్తూనే ఉంది. ఏం జరగనుందో వేచి చూడాల్సిందే.

ఓటుకు కోట్లు కేసులో అడ్డంగా దొరికిన..

## మత్తయ్యా, హ్యారీ సెబాస్టియన్‌లు!



బిషప్ హ్యారీ సెబాస్టియన్



యెరూషలేము మత్తయ్య

యెరూషలేము మత్తయ్య, బిషప్ హ్యారీ సెబాస్టియన్‌లు ఓటుకు కోట్లు కేసులో తెలంగాణ ఎసిబికి అడ్డంగా దొరికిపోయారు. మత్తయ్య ఆంధ్రా సేవకుల్ని అనేక రకాలుగా నెట్‌లో తిడుతూ పోస్టింగ్‌లు పెట్టేవాడని, తెలిసిన ఈ మెయిల్లకు వాటిని పంపేవాడని అతని గురించి క్రైస్తవుల్లో చర్చలు జరిగేవి. క్రైస్తవులకు ప్రాంతీయబేధాలుండవు. పక్షపాతమూ ఉండదు. ఈ మాత్రం తెలియనివారే ప్రాంతీయ బేధాలు కల్పిస్తూ గలిబిలి చేసేందుకు ప్రయత్నిస్తారు. ఇది దేవుని ఉద్ధేశాన్ని ధిక్కరించడమే అని హితవు పలికే బైబిలు పండితుల మాట వినుట శ్రేయస్కరం. మత్తయ్య ప్రాంతీయ బేధాలు రేకెత్తించే విధానాన్ని చూసిన తెలంగాణ, ఆంధ్రా ప్రాంత క్రైస్తవులు బాధపడేవారని వినికిడి. నేడు ఆయన్ని అదే ఆంధ్ర ప్రాంతంలో కొందరు చేరదీస్తూ కెసీయార్‌పై కేసులు పెట్టించడాన్ని వారు తప్పుపడుతున్నారు. హ్యారీ సెబాస్టియన్ కూడా పాస్టర్లకు మేరేజ్ జరిపేందుకు అర్హతనిచ్చే సర్టిఫికెట్లను జారీచేస్తూండేవారని, అవి తర్వాతి దినాల్లో విలువ లేనివిగా తెలిసి బాధనిపించేదని, అలా చేయుట ఎంతవరకు న్యాయమని వాటిని పొందేందుకు డబ్బులు చెల్లించిన కాపర్లెందరో అప్పట్లో చర్చలు జరుపుకునేవారు. అలాంటి వారిద్దరూ ఒకే కేసులో దొరికిపోవుట దేవుని తీర్పు అన్నవారూ ఎక్కువగానే ఉన్నారు. అలాంటి వారికి సపోర్టు చేయుట పార్టీకి తగదని తెదేపాను అభిమానించే క్రైస్తవులు హితవు పలుకుతున్నారు. మత్తయ్య ఎవరితోనైనా మాట్లాడేటప్పుడు ఆంధ్రప్రదేశ్ మంత్రి రావెల కిషోర్‌బాబు అనుచరునిగానే తన్నుతాను పరిచయం చేసుకునేవాడన్న చర్చలు సాగుతున్నాయి. తెదేపా అధినాయకులు వీరిపై కఠిన నిర్ణయాలు తీసుకుంటే క్రైస్తవులు సంతోషిస్తారని, అది పార్టీకి మేలు చేస్తుందంటున్నారు క్రైస్తవనాయకులు, పాస్టర్లు, విశ్వాసులు. రాబోవు రోజుల్లో జరిగే పరిణామాలు అందరికీ మేలు చేసేట్లుండాలన్నదే మా ప్రార్థన అంటున్నారు రెండు తెలుగు రాష్ట్రాల్లోనున్న క్రైస్తవ నాయకులు, పాస్టర్లు, పెద్దలు మరియు విశ్వాసులు.

## యోగాలో సూర్య నమస్కారముంటుందా?

### ఉంటే దాన్ని క్రైస్తవులు ఆచరించరు!

యోగాసనాలు వేస్తే శరీరానికి మేలు జరుగుతుందంటే ఎవరికైనా అభ్యంతరముండకపోవచ్చు. అంతేగాని అందు నక్షత్ర గ్రహ సముదాయాలకు నమస్కరించుట తప్పని సరైతే.. దాన్ని క్రైస్తవులు విభేదిస్తారన్నది నిర్వివాదం. అందుక్కారణం బైబిల్ వాక్యాలే! మన మనుగడ కోసం దేవునిచే చేయబడిన నక్షత్ర, గ్రహాలను క్రైస్తవులు ఆరాధించరు. వాటిని మన మేలుకై ఇచ్చిన దేవున్నే వారు ఆరాధిస్తారు. బలవంతంగా ఎవరిపైనైనా దేన్నైనా రుద్దజూపుట తగదంటున్నారు యోగాను గురించి అనేక చర్చలను వింటున్న క్రైస్తవులు. క్రైస్తవులకు బైబిలే ప్రామాణికం అంటున్నారు బోధకులు. దీనిపై ప్రభుత్వమెలా స్పందించనుందోనన్న ఆసక్తితో క్రైస్తవులున్నారు.



## కృతజ్ఞతలు!

రెవ.డా.ఈ.ఎం.జార్జిరాజు గారు ప్రభువునందు నిద్రించి 5 సంవత్సరములు గడిచిన సందర్భంలో మేము ఏర్పాటు చేసిన 'జ్ఞాపకార్థ కూడిక'కు విచ్చేసి మమ్మల్ని మరింత బలపర్చి మాకోసం మా పరిచర్యకోసం ప్రార్థించిన.. వారందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు చెబుతున్నాం.

– శ్రీమతి మేరీజార్జిరాజు మరియు కుటుంబీకులు.



సియోను మందిరంలో...


## బ్రదర్ వై.కనకరాజు వాక్యోపదేశం

విశాఖపట్నం : పాస్టర్ శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో నడుపబడుతున్న సియోను మందిరంలో.. 21వ, తేదీ ఆదివారంనాడు 'క్రైస్తవనాడు' ఎడిటర్ వై.కనకరాజు వాక్యోపదేశం చేసారు.

యుగయుగముల దేవా - చేకొనుమివే నా నీరాజనాలు 2
అభిషేకము యొక్క పరిచయము 4
ఆస్తులు కూర్చుటెందుకు?! 5
ప్రార్థనంటూ చిత్ర విచిత్రాలు 6
శరీరకార్యములు 7

లోకోక్తి : పూలు అందించే చేతులకే వాటి సువాసన అంటుతుంది.

సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము ★




(మొదటిపేజీ తరువాయి)

మామూలుగా అవసరాలు తీర్చుకొనుటకు దేవుని తలంచువారు, కొలిచేవారు ఆయనను అర్ధం చేసుకొనుట బహు కష్టతరం. కాబట్టి దేవుని గూర్చియు ఆయన శాసనాలను గూర్చియు ఆలోచించే వారు ఆయన మహిమాన్విత శక్తిని ఎరుగుటకు బైబిలును ధ్యానించుట కంటే సులువైన మార్గం మరొకటి లేదని, అది దేవుని గ్రంథమని క్రైస్తవుల అభిప్రాయం. శాసనకరమైన దేవుని తత్వం తెలుసుకొనుటకు బైబిలునందున్న అనేక వచనాలను ధ్యానించాలి. మనం దేవున్ని ఎరుగుతూ ఆయన శాసనాలను గ్రహిస్తూ ముందుకు సాగుదాం.

ముందుగా మన నివాసయోగ్యమైన భూగోళమును గూర్చి దేవుని గ్రంథములో ఉన్నది చదవండి.

**భూమిని ఆయన నరులకిచ్చి యున్నాడు. ★**

పై దేవుని వాక్యం చదువు వారికి సామాన్యంగానే కనిపిస్తుంది. దాన్ని ధ్యానిస్తే మనందరికి నివాసయోగ్యంగా ఆయన భూమిని ఇచ్చినట్లు అర్ధమౌతుంది. నేటి శాస్త్రవేత్తలు విశ్వంలో గల అనేక గ్రహాలలో మనవంటి వారున్నారేమోనని వెతుకుతున్నారు. దానికోసం కోట్లాది రూపాయల వ్యయంతో తయారుచేయబడిన రాకెట్లను, టెలిస్కోపులను వినియోగిస్తున్నారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా దాంతో విశ్వంలో ఇంతవరకు భూమిపై ఉన్నటువంటి జీవజాలాన్ని కనుగొనలేకపోయారు. అంటే ఇప్పటివరకు విశ్వంలో మనవంటి జీవజాలాలు లేనట్లుగానే పరోక్షంగా అంగీకరించవలసి వస్తుంది. గ్రహాలను పరీక్షించు అవకాశం మనుషులకు లేకపోతే గ్రహాలలో మనుషులు లేరను సంగతి నమ్ముటెట్లు? అందువలన దేవుడే మనుషులకు విశ్వాన్ని పరిశోధించు జ్ఞానం దయచేస్తున్నాడని నమ్మవచ్చును. ఎందుకంటే పరిశోధించి తెలుసుకొన్నప్పుడే కదా మనుషులు తన గ్రంథాన్ని నమ్ముటకు అవకాశం మరెక్కువని భవిష్యత్తు ఎరిగిన దేవుడాయన. ఇంతటి తెలివితేటలు మానవులకే ఎందుకని మానమాలోచిస్తే మనం ఆయన స్వరూపాలం. ఆయన పోలికని బైబిలు తెలియజేస్తుంది. ఆయన స్వతంత్రుడైనట్లుగానే ఆయన పిల్లలమైన మనల్ని కూడా ఆయన స్వతంత్రులుగానే చేసినట్లు బైబిలు చెప్తుంది. బైబిలును బట్టి భూమిపైనే నరులున్నారని, మరే గ్రహంలోనూ ఉండబోరని క్రైస్తవులు సంపూర్ణంగా నమ్ముటకు, నమ్మి అనేకులకు ప్రకటించుటకు ఆధారమేర్పడింది. విశ్వంలో భూమిపై మాత్రమే నివాసయోగ్యానికి తగినంత నీరున్నదని , ఆ నీటివలనే వృక్ష, జీవజాతులు మనుగడ సాగిస్తున్నాయని తెలుసుకుంటున్నాం. భూగోళం దేవుని చిత్తాన్ని మానవులపట్ల చక్కగా నెరవేరుస్తూ తగిన ఆహారాన్ని, ఇతర అనేక అవసరాలను తీర్చేవాటిని అందిస్తున్నదని తెలిపే వాక్యం చదవండి.

**ఎట్లనగా భూమి తనమీద తరచుగా కురియు వర్షమును త్రాగి యెవరి కొరకు (మనకొరకే) వ్యవసాయము చేయబడునో వారికనుకూలమైన పైరులను ఫలించుచు దేవుని ఆశీర్వచనము పొందును. ★**

చదవబడిన దేవుని వాక్యం బైబిలునందు ఎప్పటిది? ఓ సారి ఆలోచించండి! సుమారుగా క్రీ.శ. మొదటి శతాబ్దంలో వ్రాయబడిందని బైబిలు పండితుల అంచనా. అప్పటి మానవులకు ఇప్పుడు మనకున్నంత శాస్త్ర సాంకేతిక అభివృద్ధి లేదు. అయినా భూమి వర్షాన్ని పీల్చుకుని సస్యశ్యామలమై మనకొరకు ఫలిస్తుందని వ్రాయబడింది. వ్రాసినవాడు యేసు శిష్యుడు పౌలైనా.. వ్రాయించినవారు దేవుడే సుమా ! ఎందుకనగా దేవునికి మాత్రమే ఆ సంగతి తెలుసు గనుక ! పౌలు కంటే ముందున్న ప్రవక్తల ద్వారా దేవుడు వ్రాయించిన మరొక వచనం బైబిలు నుండి చూడండి.

**ఆయన ఆజ్ఞ ఇయ్యగా జలరాసుల ఆకాశమండలములో పుట్టును, భూమ్యంత భాగములలో నుండి ఆయన ఆవిరి ఎక్కజేయును, వర్షము కలుగునట్లుగా ఆయన మెరుపులు పుట్టించును, తన ధనాగారములలో నుండి గాలిని రావించును. ★**

పై మాట క్రీ.పూ. సుమారు 800 సంవత్సరాల క్రిందటిదని అంచనా. ఆలోచిస్తే మన కన్నులకు ఆశ్చర్యం కలగాలి. అప్పటి దినాలలో అంత ఖచ్చితంగా వర్షం కురియుటకు కారణం వ్రాయబడింది. అప్పటి మనుషులకు అది అందని జ్ఞానం. నేటి దినాలలో ఉన్న మనకైతే ఆ సంగతి శాస్త్రజ్ఞుల వల్ల తెలియజేయబడి పాఠ్యాంశాలుగా నేర్చుకున్నాం. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి శాస్త్రవేత్త కనుగొన్న విషయాన్ని మనం వెంటనే ఎటువంటి సందేహం వ్యక్తపరచక నమ్ముతాం. దేవుని గ్రంథంలో ఇటువంటివనేక విషయాలు చదివి, గ్రహించి, ధ్యానిస్తే మనకంటే ఆధ్యాత్మిక జ్ఞానులెవరుంటారు? ఆలోచించండి! దేవుని శాసనాన్ని సృష్టి ఎంత చక్కగా నెరవేరుస్తుందో, దానిని బట్టి దేవుని ఆశీర్వాదం ఎంతగా పొందుతుందో లేఖనాలలో గల కొన్నింటిని చదివారు. అనేకులు దేవుని ఆశీర్వాదాలు పొందకపోవుటకు కారణం ఏంటని ఎప్పుడైనా ఆలోచిస్తున్నారా? లేక దేవునిపై నిందలేస్తున్నారా? ఆలోచించి సరిచేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మనలో కూడా అనేకులు దైవాశీర్వాదాలు పొందకపోవుటకు కారణం దేవుని దేవునిగా మహిమపరచకపోవుటయేనన్నది ఎరగాలి. సర్వసృష్టి ఆయన శాసనాల్ని పాటిస్తుంది. ఆయన రూపంలో చేయబడి స్వతంత్రులైన మనుషులు ఆయన శాసనాల్ని ధిక్కరించుటయే శ్రమలకు కారణం అని ఎంత వేగంగా గుర్తిస్తే అంత మంచిదని ఆధ్యాత్మిక వాదుల హితవు.

సర్వసృష్టి ఆయన శాసనాల్ని సక్రమంగా పాటిస్తున్నట్లు బైబిలునందు అనేక సంగతులు వ్రాయబడ్డాయి. వాటిన్నింటిని అర్ధం చేసుకొనునట్లు మానవులకు తగిన జ్ఞానం , బుద్ధి, వివేకం అనుగ్రహించుటకు ప్రభువైన యేసుక్రీస్తు దేవునికి మనకు మధ్యవర్తిగా ఈ లోకానికి వచ్చారు. ఆయనలా వచ్చినట్లు మనం నమ్మేందుకు కారణం యేసుక్రీస్తును గురించి బైబిలునందున్న వచనాలే అక్షర సాక్ష్యాలు.

**మనము సత్యవంతుడైన వానిని (తండ్రియైన దేవునిని) ఎరుగవలెనని దేవుని కుమారుడు (ప్రభువైన యేసుక్రీస్తు) వచ్చి మనకు వివేకమనుగ్రహించి యున్నాడని యెరుగుదుము ★**

యేసుక్రీస్తే దేవుని వాక్యమని, ఆ వాక్యమే శరీరధారియై మన మధ్య నివసించెనని చెప్పిన బైబిలునందున్న వాక్యాలు మనకు తెలుసు.

**‘నీ (దేవుని) వాక్యము (యేసుక్రీస్తు ) వెల్లడి అగుట తోడనే వెలుగు కలుగును’** అని బైబిలు సాక్ష్యమిస్తుంది. బైబిలు ప్రపంచానికి వెల్లడి అయిన సంవత్సరాల తరువాతనే మానవులు విశ్వానికి, లోకానికి సంబంధించిన అనేక అత్యద్భుత అవిష్కరణలు చేసారు. శాస్త్ర సాంకేతిక పరంగా అనేక విషయాలను లోకానికి తెలిపారని చరిత్రను చూస్తే సులువుగా తెలుస్తుంది. మనమున్న భూమిని గురించి దేవుని శాసనాల్లో కొన్నింటినే ఇంతవరకు మనం ధ్యానించాం. ఆ ‘శానసకర్త’ శాసనాలనెన్నింటినో చదివి, ధ్యానించే భాగ్యం మనకు కలిగింది. అది యేసుక్రీస్తు కృప మాత్రమే! మనందరి ఆధ్యాత్మిక మేలుల కోసం.. బైబిలునందున్న సర్వోన్నతుని శాసనాలను అందరికి తేటపరచుటకు మాకు మరింత జ్ఞానం , శక్తి పొందేట్లు ప్రార్థించాలని కోరుతున్నాం.

క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమపరుస్తున్నప్పుడు మనలో కొందరిలా ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోళికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో ‘క్రైస్తవనాడు’ తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇందుకు భిన్నంగా చాలామంది ఇతరుల గ్రంథాలు, విశ్వాసుల జోలికెళ్తూ వివాదాలకు కారణమౌతున్నారన్నది వింటున్నాం. ఇది లేఖన వ్యతిరేకమన్నది బైబిల్లో పట్టున్నవారిమాట. లోపల పేజీల్లో బైబిలుకు సంబంధించిన అనేక వివరణలు ఇస్తూ విశ్వాసులను కాపర్లను బలపరుస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. అందెట్టి సందేహాలు, ప్రశ్నలున్నా కార్యాలయానికి ఉత్తరం వ్రాయండి. మీరు వ్రాసిందాన్నిబట్టి మరింత వివరణ తదుపరి పేపర్లలో ఇస్తాం. -ఎడిటర్

# యుగయుగముల దేవా- చేకొనుమివే నా నీరాజనాలు



**వివేకవతి.జో.**
అధ్యక్షులు
తెలుగు బాప్టిస్ట్ సంఘం
నెల్లిమర్ల

ప్రభాత వేళ - నీ స్వరూప దర్శనంగాంచి
మస్తిష్కమెల్ల - నీ కృపాతిశయమై అలరించె
మధ్యాహ్నపు వేళ - నీ స్త్రోత్రగానాలు నేసల్ప
ఆంతర్యాన జ్ఞానమే - అంతరంగాన నెమ్మదే సంప్రాప్తించె
సంధ్యవేళ - నీ స్నేహమాధుర్యంతో-నేతరయించి ప్రార్ధింప
నీ కటాక్ష వీక్షణాలు - నన్ను పరిక్షించి చూచి నీ ప్రేమబడిని
నన్నుదాచె
నిశీధివేళ - నిశ్శబ్ధాన - ముకులిత హస్తముతో
నిన్నుగొలువ
నిర్మలాత్మనొంది - రక్షణానంద పారవశ్యములో మునిగి
తేలియాడెద
జీవితమంత వెంబడించి - నీ స్తుతిగానాలు నే పాడుచు
పర్వత శిఖరాలు వెదకినా
అగాధలోయలన్ని వెదకినా
దిశదశలన్ని కలయ జూచినా
పరిపూర్ణ సౌదర్యముగల యెహోవా
నీ అనుదిన వాత్సల్యతే! నీ నిత్యకృపయే
అడుగడుగున కానవచ్చెనయ్యా! నీవు తప్ప మాకెవరు దిక్కు?
యుగయుగములకు మాదేవుడవునీవే
చేకొనుమివే నా నీరాజనాలు.

## టి వి బోధకుల్లారా..!

విశ్వాసుల్ని కనీసం ప్రార్ధనైనా చేసుకోనివ్వరా?! మీకు చెబితే అదీ మీరే చేసేస్తారా? వారి గొంతును చనిపోయేవరకు దేవునికి వినబడనివ్వరా? యేసు తన శిష్యులకు ప్రార్ధన నేర్పారన్నది మరిచారా? మిమ్మల్నే గ్రుడ్డిగా నమ్మే విశ్వాసులకు ప్రార్ధన చేసుకోమని ఇంకెప్పుడు చెబుతారు? అలా చెబితే మీ ఆదాయం పోతుందన్న వ్యాపారాత్మక ధోరణి మీచే అలా చెప్పనివ్వట్లేదా? (మరింత విశ్లేషణ వచ్చే పేపర్లలో) – బ్రదర్ వైకెయార్

## దేవున్నే ఎరగలేనంత బిజీ జీవితమా?

- ❑ జీవితం బిజీ బిజీయా?
- ❑ ఎవరేం చెప్పినా నమ్మేయడమేనా?
- ❑ అది నిజమా కాదాయని బైబిల్లో చూచే సమయమే లేదా?
- ❑ అయితే చెడిపోతావ్ జాగ్రత్త!

ఎవరైనా చెప్పింది గుడ్డిగా నమ్మేయడమే గాని అది సత్యమా కాదాయని బైబిల్లో వెదికేందుకు అనేకులకు సమయమే ఉండదు. అదే ఎవరైనా ఏదైనా ఇస్తానన్నారంటే చాలు! దాన్ని తెచ్చుకొనేందుకు ఎంత సమయమైనా ఉంటుంది. అట్టి కోవకు చెందిన వారందరూ దేవునిలో భ్రష్టులే సుమా! మారుమనస్సు వారికే అవసరం. అది గుర్తించి అట్టివారు ఇకనైనా మారాలి. తమ జీవితంలో అట్టి మార్పుకు చోటివ్వకుంటే తుదకు నాశనమగుట ఖాయం. మార్పు చెందితే ఆశీర్వాదాలన్నవి నేర్చుకుంటుంన్న దేవుని వాక్యం వల్ల వాటంతటవే వస్తాయి. ఎవరేం చెప్పినా గ్రుడ్డిగా అవే దేవుని ఉద్దేశాలని నమ్మితే చెడిపోతారు, జాగ్రత్త పడండి. బైబిల్లో చదివి గ్రహించండి. ఇద్దరు, ముగ్గుర్ని వాటిపై వివరణలు అడగండి. వాటిలో లేఖనానుకూలంగా ఉన్నవాటిని తీసుకోండి. అట్టి ఆసక్తి, మనస్సు మీకుంటే సర్వసత్యమేంటో తెలుసుకొనేందుకు దేవుడే సహకరిస్తారు

- బ్రదర్ వైకెయార్.

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



# అభివృద్ధి

'అభివృద్ధి' అందరూ కోరేదే! కానీ అందర్లోనూ కన్పడదు. మన చుట్టూ కన్పడే ప్రతీ జీవి దినదినానికి ఎదుగుట మనలో ప్రతీ ఒక్కరూ చూడగలుగుతున్నారు. అది చెట్టైనా లేక కుక్కైనా! వాటిని గురించి మాట్లాడుతు అవెలా ఎదిగి అభివృద్ధిని కనబరుస్తున్నాయో కూడా చర్చించగలుగుతున్నారు. ఇక పాలకులైతే తమను గెలిపిస్తే చాలు, మీ జీవితాల అభివృద్ధికి అవసరమయ్యే అన్ని చర్యలూ తీసుకుంటామన్న వాగ్దానాలు చేస్తుంటారు. ప్రజలూ అభివృద్ధినే కోరుతారు. ఆ తర్వాత షరామామూలే! మళ్లీ, మళ్లీ వస్తూనే ఉంటాయి ఎన్నికలు. ప్రజల్లో అభివృద్ధి మాత్రం అంతంత మాత్రమే. బీదలు బీదల్లానే ఉంటున్నారు. మధ్యతరగతి వాళ్లు మధ్యతరగతి వాళ్లానే మిగిలిపోతున్నారు. 'అభివృద్ధి' తేటతెల్లంగా కన్పడేది మాత్రం అత్యధిక శాతం రాజకీయ నాయకుల్లోను, బడా వ్యాపారవేత్తల్లోనేననుట అబద్ధం కాదు. 'అభివృద్ధి' మంత్రం జపిస్తే అభివృద్ధి జరగదు. 'అభివృద్ధి' కన్పడాలంటే చిత్తశుద్ధి కలిగి కార్యాచరణ చేపట్టాలి. అందు అందరూ భాగస్వాములవాలి. ఏ ఒక్కరో ఏదో చేసి తమను అభివృద్ధి పరుస్తారనుకొనుట కంటే, ఎవరికి వారు తమకు తామే అందుకు అంకురార్పణ చేసుకోవాలి. నేడు నాటిన విత్తనం మొక్కగా.. మ్రానుగా అభివృద్ధి చెంది, ఫలించి, తరతరాలు పోషించే స్థితి కన్పరుస్తుంది. అలాగే మనమీనాడు ప్రణాళికాబద్ధంగా చేస్తున్న ప్రతీ పని మనల్నేకాదు గాని మన తరాలను కూడా సుసంపన్నం చేయగలదు. లోకానికి ఓ సాక్ష్యంగా చూపగలదు. ఇందు రాజూ పేద తారతమ్యం లేదు. గొప్పా, బీద తేడాలసలే లేవు. 'అభివృద్ధి' ముందు మనలోనే మొదలవాలి. అది అందరికీ చెప్పుకొనేదిగా కాకుండా, తేటగా కన్పడేదిగా ఉండాలి. ఇది బైబిల్ చెప్పిందే.

నీ 'అభివృద్ధి' అందరికి తేటగా కనబడు నిమిత్తము.... ★

బైబిల్లో దేవుని మాటగా కన్పడి, ఆయన ఉద్దేశాన్ని బయల్పరచే ఈ సత్యవాక్యము లోకానికి మార్గదర్శి. దాన్ని ఆచరణలో చూపేవారు.. తాము వెలుగుతూ లోకానికి వెలుగై మరనేకుల్ని వెలిగించగలరు.

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి" ★

ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.

వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వైకె.రాజు, రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకొండి.

# దేవుని జ్ఞానం – మానవ విజ్ఞానం

బ్రదర్ వై.లీలా రవిరాజు

బైబిల్ / దేవుని మాట × సైన్స్ శాస్త్రజ్ఞుల / మాట



**మీ దేశమునకు వర్షము, అనగా తొలకరివానను, కడవరివానను దాని దాని కాలమున కురిపించెదను. అందువలన నీవు 'నీ' ధాన్యమును, 'నీ' ద్రాక్షారసమును 'నీ' నూనెను కూర్చుకుందువు. మరియు 'నీవు' తిని తృప్తి పొందునట్లు 'నీ' పశువుల 'నీ' చేలయందు గడ్డి మొలిపించెదను.** ★

భూమి బహుగా ఫలించి మానవజాతి మనుగడ సాగాలంటే ఎలా జీవించాలో దేవుని మాటలలో మునుపటి 'క్రైస్తవనాడు'లో చూసారు. దేవుడు తన పిల్లలైన మనకోసం, మనుగడకోసం బహుజాగ్రత్తలు తీసుకున్నట్లు బైబిలునందున్న అనేక వచనాలు ధ్యానించుట వలన తెలుస్తూ మనల్ని అబ్బురపరుస్తుంటాయి. ఎందుకు దేవునికి మనపై అంత ప్రేమ? ఆయన మనందరికి తండ్రి కాబట్టి. దేవుని ఆజ్ఞలు ధ్యానిస్తూ మన బ్రతుకులు పండించుకుంటే మన బ్రతుకులెలా ఆనందంగా సాగుతాయో లేఖనంలో చూశారు. ఆ లేఖనంలో 'నీ' ధాన్యము, 'నీ' ద్రాక్షారసము, 'నీ' నూనె, 'నీవు' తిని తృప్తి పొందుదువు. 'నీ' చేలయందు, 'నీ' పశువులకు గడ్డి మొలిపించెదనని వ్రాయబడింది. ఎంత గొప్ప ఆశీర్వాదం దేవుడు మనకు ఇస్తున్నారు. పొందుటకు ఇష్టపడువారే ఆయన పిల్లలు. పై లేఖనంలో అంతటా 'నీ' అని వ్రాయబడింది. అనగా మనదైనదాన్నే మనం అనుభవించాలి. పరుల భూమి, పంట కాకూడదని దేవుని వాక్యం చెప్తుంది. మన ఆలోచనలు కూడా 'మా' అన్నమే మేము తిందుము, 'మా' వస్త్రాలే మేము కట్టుకొందుము. 'నీ' పేరు' (దేవుని) పెట్టి మా నిందలు తీసివేయుమని దేవునితో చెప్పువారికి ఆయన ఆశీర్వాదం బహువేగంగా లభించునని తెలుస్తుంది. నేటి దినాలలో ఎందరు పై విధంగా సొంత వాటినే అనుభవిస్తున్నారు. ఇతరుల సొమ్మును ఆస్తులను ఎలాగైనా తమ వాటిగా చేసుకొనుటకు ఇష్టపడువారు అనేక చోట్ల కనబడ్తుంటారు. అందువల్లే సమాజంలో శాంతి భద్రతలు కరువవగుచున్నాయని మనకు తెలుసు. దేవుని మాటలయందు భయభక్తులతో జీవిస్తే భూమిపై మన బ్రతుకుకాలమంతా సుఖసంతోషాలకు లోటేం వుంటుంది! మనమలా జీవిస్తే భూమి తన ఫలాన్ని మనకు తప్పక ఇస్తుందని దేవుని వాక్యం చెప్తుంది. దేవుని ఆజ్ఞను తూ.చ. తప్పకుండా భూమి తన చుట్టూ తాను తిరుగుటలో కాని, సూర్యునిచుట్టూ తిరుగుటలో కాని, ఎక్కడా క్రమం తప్పినట్లు లేదు. దేవుని ఆజ్ఞను పాటిస్తూ భూమి దేవుని ఘనంగా స్తుతిస్తుంది. మరి మనమో? ప్రతిక్షణం దేవుని ఆజ్ఞలను మీరుతూనే ఉంటున్నామేమో! అందును బట్టియే మానవ జీవితాలలో అశాంతి పెరుగుతుందేమో? మనల్ని మనమే లేఖనం ప్రకారం పరీక్షించుకుంటూ సరిచేసుకుందాం. భూమి దేవుని ఆజ్ఞను పాటిస్తున్నట్లు తద్వారా దేవుని ఆశీర్వాదాలు పొందుచున్నట్లు లేఖన భాగంలో చూద్దామా...

**ఎట్లనగా, భూమి తనమీద తరచుగా కురియు వర్షమును త్రాగి యెవరి కొరకు (మనకొరకే) వ్యవసాయము చేయబడునో వారికనుకూలమైన పైరులను ఫలించుచు దేవుని ఆశీర్వచనము పొందును.** ★

పై లేఖనం చదివారుగా.. ఎంతో ఆశ్చర్యం కలిగించుట లేదా? ఆలోచించండి! ఎందుకు భూమికి అంత శ్రద్ధ మనపై అన్పిస్తుంది కదూ. శ్రద్ధ భూమిది కాదు ప్రియులారా, మనందరి తండ్రియైన దేవాది దేవునిది. ఆయనకు మనపై ఉన్న అపార ప్రేమకు పరాకాష్ఠే పై అక్షరసత్యం. కాదనగల ఆధ్యాత్మిక వాదులెవరు? ఉండబోరు సుమా!

**లోకోక్తులు :**

❖ ఆలోచనకు కార్యరూపం ఇవ్వడం ప్రధానం. లేదంటే ఆలోచన ఆలోచనలాగే మిగిలిపోతుంది. - బుద్ధుడు

❖ ఆత్మ విశ్వాసం మంచిదేగాని, అది శృతిమించితే సమస్యే - గాంధీజీ

❖ ఒక వ్యక్తి గుణగణాలను పరిశీలించాలనుకుంటే అతనికి అధికారం ఇచ్చి చూడండి - జాన్సన్

❖ చేయబోయే పనిని గురించి తెలుసుకోవడమే వివేకం. ఎలా చేయాలో తెలుసుకోవడమే నైపుణ్యం. పూర్తి చేయడమే సామర్థ్యం.

❖ దొంగలు కూడా దోచుకెళ్లడానికి చేతకాని సంపద నీలోని విద్య మాత్రమే.

❖ వాయువు, నీరు, వెలుగువలె విజ్ఞానం కూడా అందరికీ అందు బాటులో ఉండేలా ప్రతి ఒక్కరూ తనవంతు సహకారం అందిచాలి.

- చిలకమర్తి.

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ.

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!**

చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 9346960601 / 8885362270 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగవోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★

'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

Online A/C : CHRISTAVANAADU, Current A/C : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsha Nagar Branch, Visakhapatnam - 530 040
IFSC Code : ANDB0001396

**ఎందుకు?! :**

'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Call : 8885362270

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU, 18-441/5
Laxmi Swathi Residency, 204, Santha Palem, China Gadili,
Old dairy farm (Po), Visakhapatnam - 530 040.
A.P., INDIA. Call : 9346960601 / 9490266640
christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

# అభిషేకము యొక్క పరిచయము


బిషప్.ఎం.ఎ.పాల్

"అవి అతిపరిశుద్ధమైనవిగా ఉండునట్లు వాటిని ప్రతిష్ఠింపవలెను. వాటిని తగులు ప్రతి వస్తువు ప్రతిష్ఠితమగును. మరియు అహరోనును అతని కుమారులును నాకు యాజకులై యుండునట్లు నీవు వారిని అభిషేకించి ప్రతిష్ఠింపవలెను" (నిర్గమ 30:29,30). కనుక అభిషేకమును గూర్చి అధ్యయనం కొరకు ముందుకు సాగుదాం.

అభిషేకము పొందుకొనవలెననుకుంటే క్రీస్తు శరీరమును సంఘములో నీ యొక్క స్థానమేమిటో తెలుసుకొని తీరాలి. "కాబట్టి, మీరు సమాధానమను బంధము చేత ఆత్మ కలిగించు ఐక్యమును కాపాడుకొనుటయందు శ్రద్ధ కలిగిన వారై, ప్రేమతో ఒకనినొకడు సహించును, మీరు పిలువబడిన పిలుపునకు తగినట్లుగా దీర్ఘశాంతముతో కూడిన సంపూర్ణవినయముతోను సాత్వికముతోను నడచుకొనవలెనని, ప్రభువునుబట్టి ఖైదీనైన నేను మిమ్మును బతిమాలుకొనుచున్నాను. శరీరమొక్కటే, ఆత్మయు ఒక్కడే; ఆ ప్రకారమే మీ పిలుపు విషయమై యొక్కటే నిరీక్షణ యందుండుటకు పిలువబడితిరి. ప్రభువు ఒక్కడే, విశ్వాసమొక్కటే, బాప్తిస్మమొక్కటే, అందరికి తండ్రియైన దేవుడు ఒక్కడే. ఆయన అందరికిపైగా, ఉన్నవాడై అందరిలోను వ్యాపించి అందరిలో ఉన్నాడు. అయితే మనలో ప్రతివానికిని క్రీస్తు అనుగ్రహించు వరము యొక్క పరిమాణము చొప్పున కృప ఇయ్యబడెను" (ఎఫెసీ 4:1-7). దేవుడు అనుగ్రహించిన కృపావరమును పొందుకొని సరిగ్గా ఉపయోగించుటకు అభ్యసించాలి. మరొక విషయమేమనగా ప్రేమయందు ఐక్యత కలిగి ఉండాలి. సంఘములో ఐక్యత కలిగియుండినట్లయితే అభిషేకము ఒకరినుండి మరొకరి మీదికి ప్రవహించుటను అనుభవించగలము. ఒకవేళ ఆ ఐక్యత లోపించినట్లయితే అభిషేకము ద్వారా దేవుడే నియమించిన స్థానమును కోల్పోవవచ్చును.

తలమీద ప్రోక్షింపబడిన ఆ అభిషేకతైలము ప్రతి అవయవమును తాకుతూ క్రిందివరకు పారుతున్న ఆ తైలము నీవుండవలసిన స్థానములో ఉన్నట్లయితే నీ మీద ప్రవహిస్తూ నీగుండా కూడా ప్రవహిస్తూ దేవుడు ఆయన పనిని తుదముట్టించుటకు ముందుగానే నీకప్పగింపబడిన పరిచర్యను తెలియజేస్తుంది. "సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము! అది తలమీద పోయబడి అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచువరకు దిగజారిన పరిమళ తైలమువలె ఉండును. సీయోను కొండమీదికి దిగివచ్చు హెర్మోను మంచువలె ఉండును. ఆశీర్వాదమును శాశ్వతజీవమును అచ్చటనుండవలెనని యెహోవా సెలవిచ్చియున్నాడు" (కీర్తన 133:1-3).

1వ సమూయేలు గ్రంథం 16వ అధ్యాయములో దేవుని యొక్క అభిషేకము ఎలాగు నిరూపించబడెనో మూడు రకములుగా మూగ్గురు వ్యక్తుల జీవితాలలో చూడగలము.

మొదటిరకము వ్యక్తులు : వీరు నిపుణులు, నిష్ణాతులు, తలాంతులు కలిగిన వారు, విద్యాధికులు కానీ దేవునిచేత అభిషేకించబడిన వారు కారు. "అప్పుడు యేసు - చూచుకొనుడి, పరిసయ్యులు సద్దూకయ్యులు అనువారి పులిసిన పిండిని గూర్చి జాగ్రత్తపడుడని వారితో చెప్పెను. కాగా వారు - మనము రొట్టెలు లేనందునగదా (ఈ మాట చెప్పెనని) తమలో తాము ఆలోచించుకొనుచుండిరి. యేసు ఇది ఎరిగి అల్పవిశ్వాసులారా - మన యొద్ద రొట్టెలు లేవని మీరెందుకు ఆలోచించుకొనుచున్నారు? మీరింకను గ్రహింపలేదా? అయిదు రొట్టెలు అయిదు వేలందికి పంచిపెట్టినపుడు అదియైనను, ఏడు రొట్టెలు నాలుగు వేలమందికి పంచిపెట్టినపుడు ఎన్ని గంపెళు ళ్ళ ఎత్తితిరో అదియైనను మీకు జ్ఞాపకము లేదా?" (మత్తయి 16:6-10). అభిషేకము లేకపోయినట్లయితే పరిచర్యలేనట్లే. అభిషేకించబడని వ్యక్తిని దేవుడు ఉపయోగించుకొనడు (దేవుని పరిచర్య కొరకు). యెష్షయి కుమారులలో ఒకడిని అభిషేకించుటకొరకు సమూయేలును దేవుడు పంపించాడు. అతని కుమారులలో ఏడుగురు అభిషేకించబడలేదు. సమూయేలును వారిలో ఎవ్వరిని అభిషేకించుటకు దేవుడు అనుమతించలేదు. సందేహము లేదు వీరు బలవంతులు, యుద్ధ నైపుణ్యము గలవారు. కాని అభిషేకించబడలేదు. ఎలియాబు నిష్ణాతుడే గాని అభిషేకించబడలేదు. "వారు వచ్చినపుడు అతడు ఎలియాబును చూచి నిజముగా యెహోవా అభిషేకించువాడు ఆయన ఎదుట నిలిచియున్నాడని అనుకొనెను" (1 సమూయేలు 16:6).

రెండవ రకము వ్యక్తులు : వీరు సౌలు వలె గతాభిషేక అనుభవంగలవారు. సౌలు బలశాలి, ఇశ్రాయేలీయులందరిలో పొడగరి. శరీరసౌష్టవం గలవాడు. అంతేకాక యుద్ధ ప్రావీణ్యత గలవాడు. అయినప్పటికీ దేవుని చిత్తమునకు అవిధేయత చూపిన కారణాన దేవుడు అభిషేకించి తనకిచ్చిన స్థానాన్ని కోల్పోయాడు. ఇది చాలా విచారకరము. దేవుడిచ్చిన అధికారాన్ని, రాజ్యాన్ని మరియు రాజరికమును కూడా కోల్పోయాడు.

న్యాయాధిపతుల గ్రంథములో సంసోను అనే వ్యక్తిని చూడవచ్చు. ఫిలిష్తీయుల గుండెలను భయముగా మారిన వ్యక్తి (న్యా॥ 16:20). తన ప్రజలను విమోచించుటకు ఎన్నుకొనబడిన వ్యక్తి. అద్భుతమైన అభిషేకమును దేవుడు సంసోనుపై ఉంచాడు. ఇతడు కూడా ఆ అభిషేకమును కోల్పోయాడు. ఏ పని కొరకు ప్రత్యేకింపబడినాడో (నాజీరు చేయబడినాడో) దానినుండి తొలగింపబడినాడు. కంటి చూపును కోల్పోయాడు. శతృవుల చేతిలో బానిసగా మారిపోయాడు. దేవుని ఆత్మ తననుండి వైదొలగిపోయాడన్న నిజాన్ని గ్రహించలేకపోయాడు.

మూడవ రకానికి చెందినవారు : వీరు దేవుని యొక్క సంకల్పము చొప్పున పిలువబడి ఆయన ప్రజలకొరకు, ఆయన ఉద్దేశ్యమును నెరవేర్చుటకు అభిషేకింపబడినవారు.

ఉదాహరణకు దావీదు : తన అన్నలవలె బలవంతులు గాని యుద్ధశూరుడు గానికాదు. ఒక చిన్న గొర్రెల మందను కాచుకొనే పని అప్పగింపబడిన బాలుడు. అయినప్పటికీ దేవుని యొక్క అభిషేకము తన జీవిత గమనాన్నే మార్చివేసింది. తన స్థానాన్ని తన గమ్యాన్ని కూడా మార్చివేసింది. దావీదును గూర్చి స్వయంగా దేవుడే సాక్ష్యన్నిస్తున్నాడు (అపొ.కా. 13:23,24).

ఈ మూడు రకాలకు చెందినవారు కాక మరొక రకం వారున్నారు. వారెవరంటే దేవునిచేత అభిషేకించబడిన దైవజనులను శపించేవారు, అసహ్యించుకొనేవారు, వారిని అగౌరవపరచేవారు.

ఉదాహరణకు - గొల్యాతు ప్రఖ్యాతి గాంచిన యోధుడు. ఇశ్రాయేలు దేశమంతటిలో ఒక్కడు కూడా అతని ఎదుట నిలవజాలలేకపోయాడు. రాజైన సౌలుతో సహా. అయితే చిన్నవాడైన దావీదు మీద ఉన్న దేవుని యొక్క అభిషేకము యొక్క శక్తిని చనిపోయినంత వరకు కానలేకపోయాడు.కనుక దేవుని చేత అభిషేకించబడిన దైవజనుని గాని, అతనిపైనున్న అభిషేకాన్ని గాని తక్కువ అంచనా వేయకూడదు. చాలా జాగ్రత్త వహించాల్సి ఉంది.అభిషేకించబడిన దైవజనునిలోనుండి ప్రవహించు అభిషేకం విషయంలో ఎంత జాగురూకత కలిగియుండాలో ఈ లేఖనాల పరిశోధన ఆదారంగా మనం గ్రహించాలి.

## తెలుసుకుందాం!

★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును


❖ కాఫీ మొక్క నాటిన నాటినుండి ఐదేళ్లకి కాపుకాస్తుంది.

❖ ఒకటి నుంచి వంద దాకా అంకెల్ని కూడితే 5050 అవుతుంది.

❖ స్విట్జర్లాండ్ జాతీయజెండా చతుర స్రాకారంలో ఉంటుంది.

❖ జిరాఫీలకు స్వరపేటికలు ఉండవు.

❖ అమెరికా అధ్యక్షుల్లో సగంమంది ఐరిష్ సంతతి వారే.


❖ దోమలు, తేనెటీగలు చేసే శబ్దం అవి రెక్కలను వేగంగా కదిలిస్తూ ఉండటం వల్ల వస్తుంది.

❖ సముద్రంలోని అతి పెద్ద అలలను స్ప్రింగ్‌టైడ్స్ అంటారు. అలాగే అతి చిన్నవాటిని నీప్‌టైడ్స్ అంటారు.


❖ బైబిల్‌లో పిల్లి తప్ప మిగతా పెంపుడు జంతువులన్నీ ఉన్నాయి.

❖ తల తిప్పకుండానే పక్కకు చూడగలిగేవి రెండే జంతువులు కుందేలు, చిలుక.

❖ నత్తలు మూడేళ్లపాటు నిద్రపోగలవు.



❖ ఇప్పుడు మనం చూస్తున్న ప్రపంచ పటాన్ని తయారు చేసింది బాబిలోనియన్స్. క్రీ.పూ 2300 సంవత్సరాల నాటికే వారు ఈ మ్యాప్‌ను తయారు చేసారు.

❖ ఎగుడుదిగుడు ముక్కుతో పుట్టేవారిలో నాయకత్వలక్షణాలు ఎక్కువగా ఉంటాయని పురాతన రోమన్లు భావించేవారు.

❖ పెన్సిల్ మెదట్లో గ్రాఫైట్ స్టిక్‌గా మాత్రమే ఉండేది. తరువాత దాన్ని తేలికైన చెక్కలో అమర్చడంతో ప్రస్తుత రూపాన్ని సంతరించుకుంది.

❖ ఒకే ఒక రైల్వేస్టేషన్ ఉన్న దేశం సింగపూర్.




❖ గాలిలో ఎగరలేని, నీటిలో ఈదగలిగే ఒకే ఒక్క పక్షి పెంగ్విన్.



❖ అగ్గిపుల్లని కనిపెట్టక ముందే లైటర్‌ని కనిపెట్టారు. అప్పట్లో దాన్ని 'వండర్ లైట్' అని పిలిచేవారు.


❖ నీలి తిమింగలం చేసే శబ్దం నీటిలో 530 మైళ్ల దూరం ప్రయాణిస్తుంది.

❖ మెదడు కణాల జీవితకాలం ఎంత ఎక్కువంటే... అవి మనిషి జీవితకాలమంతా బతికే ఉంటాయి.


❖ ఇరవై నాలుగు కేరట్ల బంగారంలో కూడా కొద్దిపాటి రాగి ఉంటుంది. శుద్ధమైన బంగారం మృదువుగా మైనంలా ఉంటుంది.

❖ జలగలకు శరీరంలో ప్రతి భాగానికి ఒకటి చొప్పున 32 మెదళ్లు ఉంటాయి. మళ్ళీ వీటన్నిటినీ అనుసంధానించే ప్రధాన మెదడు ఇంకొకటి ఉంటుంది.

# ఆస్తులు కూర్చుటెందుకు?!

## మోసపోకుడి దేవుడు వెక్కిరించబడడు. ★




క్రైస్తవలోకంలో ఎందరో ఒకనాటి తమస్థాయి హీనమని నేడెంతో ఘనమని ప్రకటించుకొనుట చూస్తుంటాం. మంచిదే, దేవునికే మహిమ. అటువంటి వారు ఆ మహిమను దేవునికెన్నాళ్ళు ఉంచుతున్నారు? ఆలోచించాలి. ఒకనాటి వీరి ప్రయాసను చూసి, ప్రభువు వీరిని నమ్మి వీరిని అంతటివారిగా చేసుండొచ్చు? తన పరిచర్య 'ఎంతో సక్రమంగా' జరిగిస్తారని నమ్మిన దేవుని పరిచర్యలో వీరు చేసేదంతా 'అక్రమమే'! ఈ విషయం వీరి జీవన విధానం చూస్తే ఇట్టే అర్థమైపోతుంది ఎవరికైనా అన్న చర్చలే విశ్వాసుల్లో అనేక చోట్ల వినగలం, చూడగలం. వీరి బ్రతుకుల్లో తెల్లవారితే చాలు ఆస్తుల లెక్కలే. క్రీస్తు మాటలు ఆచరణలు వీరి జీవితాల్లో మచ్చుకు కన్పడవు. అవెప్పుడో మరిచిపోయినట్లే కన్పడతారు. వీరి చెంతకు ఎవరైనా కాపరి, విశ్వాసి, సువార్తకుడు లేక ప్రభువు పరిచర్యను చేయువారు వెళ్తే వీరి నోటంట అనర్గళంగా ప్రభువును గూర్చిన మాటలే వస్తాయి. లేఖనాలెన్నో వల్లెవేస్తారు. వారికి ప్రభువును గూర్చి తెగ చెప్తుంటారు. ఒకనాటి దినాల్లో వీరెంతో ప్రయాసతో తిరిగిన ఊళ్ళు వీరికిప్పుడేమాత్రం గుర్తురావు. ఆరోజులే వేరండి! అంటారేగాని ధనం కల్గిన తర్వాత రోజులెలా మార్తాయో వీరిని చూసి గ్రహించవచ్చు. మారేవి రోజులు కావు. రోజులెప్పుడు ఒకలానే ఉంటాయి. దేవుడు చేసిన నియమాన్ని అవి దాటవు. వాటికా స్వాతంత్ర్యత లేదు. స్వాతంత్ర్యమున్న మనుష్యుల్లోనే మార్పు. మన పాపాల్ని బట్టియే దేవుని చిత్తప్రకారం ప్రకృతిలో వికృతమైన మార్పులొస్తున్నాయని బైబిలు ఖండితంగా చెప్తుంది. ధనం లేని దినాల్లో దేవుడెల్లప్పుడు గుర్తుంటారు. సేవ సేవంటూ ఊర్లన్నీ తిరుగుతూ బ్రతుకును గడుపుతారు. దేవుడు తగుమాత్రం సహాయం ఎవరిద్వారానైనా చేస్తే ఇక వారి వెంటే పడి ప్రభువును ప్రక్కన పడేసే వారెందరో. నేడు విదేశీ, స్వదేశీ దానాలు పొంది ధనవంతులుగా చలామణి అవుతున్న వారిలో అత్యధిక శాతం వారు ఈ కోవలోకే వస్తారనుటలో సందేహంలేదు. విదేశీయులైనా స్వదేశస్థులైనా ఇచ్చేది పరిచర్యకు. పరిచర్యలో మొదట దేవుని కోసం, తర్వాతే మన కోసం అన్న ఆలోచన అందరూ కలిగుండాలి. అనగా మొదటంతా దేవునికోసం ఖర్చుచేయాలి. దేవుని పని మనం చేస్తే మన పని దేవుడు చేస్తాడు. అదే విశ్వాసమంటే.

ధనమొచ్చిన తర్వాత ఎందరో సేవకుల్ని ఆ ధనమే పాలిస్తుంది. దేవుడు వారి క్రియల్లో కనబడరు. ఇన్‌వెస్ట్‌మెంట్లు అనేక రూపాన వీరి జీవితాల్లో కన్పడుతుంటాయి. అనేక విలాస వస్తువులు వీరిండ్లంట ఉంటాయి. కొన్ని అవసరం లేకున్ననూ మెహర్బానీకి కొంటారు. కొందరి ఇండ్లు, ఇండ్ల స్థలాల లెక్కే తెలియదు. మరికొందరైతే ఊళ్ళకు ఊళ్ళే కొనేయాలను కుంటుంటారు. తద్వారా తమ ఆధిక్యత కనబర్చవచ్చునని వీరి ఉద్దేశమేమో! అవన్నీ కొవడం తప్పని చెప్పట్లేదు కానీ ఎలా వచ్చిన సొమ్ముతో అవి కొంటున్నారు? ఆలోచించాలి!

బైబిల్లో ఎక్కడైనా క్రీస్తు ఆస్తులు కూర్చమన్నారా? ఆత్మలు కూర్చమనే కదా మనకి చెప్పారు. మరెందుకు క్రీస్తు పేరున ఉదారంగా వచ్చిన సొమ్ముతో ఆస్తులు కొనుట? వాటివలన క్రీస్తుకేం లాభం, వీరికి వీరి కుటుంబాలకే లాభం. దేవుడు అనుమతించక పోతే వీరెంత కూర్చిననూ వీరు వీరి కుటుంబాల వారు వాటిని అనుభవించగలరా? ఆలోచించండి. మరెందుకు అనవసరంగా వృథా ప్రయాస. ఏమీ లేనివాడు సహాయం చేసిన దేవుడు కడవరకు సహకరించరా? కుటుంబాన్ని కాపాడరా?అన్న సందేహాలు క్రైస్తవులకు ఉండ తగునా? సందేహమున్నవారే ఆస్తులు కూర్చుకుంటూ అవే వారిని, వారి కుటుంబస్తులను కాపాడతాయని భ్రమపడతారు. అట్టి వారు చేయు సేవ ఆస్తులు కూర్చుటయే. వారికున్నది దేవునియందు ఆవిశ్వాసమే ఏమీలేని నాడున్న విశ్వాసం అన్నీ కల్గిననాడు లేకపోవుట ఎంత దురదృష్టకరం.

సొంత సొమ్ముతో వ్యాపారాలు, ఉద్యోగాలు చేసి ఆస్తులు కూర్చుకుంటే ఎవరూ తప్పుపట్టరు. సేవాపరిచర్యల కొరకు దేవుని వలన ఇవ్వబడిన దానం ఆస్తులుగా మార్పు చెందుట దేవుని మోసగించుటయే. దేవుని మోసగించుట మనుష్యులకు సాధ్యంకాదు. అయినాసరే అట్టివారు కొన్నాళ్లు వైభోగాలను అనుభవించుట దేవుడెందుకు చూస్తూ ఊరకున్నారు? అన్న అనుమానం మీకొస్తే అది దేవుని ఉచిత కృప మాత్రమేనని గ్రహించాలి. ఎందుకంటే వీరు మార్తారని ఎవరైనా హెచ్చరించినా, బుద్ధిచెప్పినా మారొచ్చని దేవుడు వహించిన దీర్ఘశాంతమే. ఇది లేఖనసత్యం. గద్ధించువారిని దేవుడు లేపి వీరిని గద్ధించినా ఆ గద్ధింపును వీరు పెడ చెవిన పెడితే జరిగే దారుణాలు అంతింతని చెప్పలేం.

దేవునికి దీర్ఘశాంత ముంటుందని వ్రాయబడిందేగాని శాస్వత శాంత ముంటుందని వ్రాయబడలేదని గ్రహించాలి. ఇతరులు చేసిన సహాయంతో ధనవంతులుగా చలామని అవుతున్న వీరి జీవితాల్లో 'దేవుని శాంతం' ఎప్పట్నుండి మొదలైందో ఎవరికెరుక? ఆ దీర్ఘశాంతము ముగిసే కాలం రాకమునుపే అట్టివారు మారుట మంచిదని గ్రహించాలి. ఏమీలేని రోజుల్నుండి నేటివరకూ ఏలోటూ లేకుండా చూసే దేవుడే మన జీవితం కడమట్టుకు చూడగల సమర్థులని ఎరుగుటయే విజ్ఞుల లక్షణం. మన మట్టుకే కాదు గాని మన కుటుంబస్థుల వల్ల ఆయన సేవాపరిచర్యలు జరిగేంత కాలం ఆయన కాచికాపాడ గల సమర్థులని గ్రహించుట అత్యావశ్యం అదే ఓ ఆశీర్వాదం.

క్రీస్తును నమ్మిన తర్వాత మన బ్రతుకుల్లో అనేక శ్రమలు రాక తప్పదు. తగు సహాయం దయ చేస్తూ విడుదలనిచ్చే దేవున్నే మనం కలిగున్నాం. కాబట్టి మన బ్రతుకుకాలంలో మన పిల్లలకు బైబిలును నేర్పుదాం.వారికి బ్రతుకును దేవుడే నేర్పుననుటలో సందేహం వలదు. దేవునికి అప్పగించుకొన్న ప్రతి కుటుంబం క్రమక్రమంగా ఈ లోకంలో కూడా ఆశీర్వదించబడుట తథ్యం. ఇది లేఖన సత్యం.

**మన జీవితాల్లో అట్టి ఆశీర్వాదాలు మెండుగా పొందాలంటే దేవుడు మనల్ని నమ్మి అప్పగించిన ఆయన పనిని ఎటువంటి మోసాలకు తావు లేకుండా చేయాలి. మోసగించుటకు ప్రయత్నించి కుటుంబంలో కష్టాలు, నష్టాలతో అల్లకల్లోలం మీయంతట మీరే సృష్టించుకోకండి. కుటుంబ సాక్ష్యం పోగొట్టుకోకండి. దేవుని ఎవరూ మోసగించలేరు జాగ్రత్త సుమా!**

**టిప్స్ :** ❑ స్వచ్ఛమైన బాదం నూనె చర్మానికి చక్కని టానిక్‌లా పనిచేస్తుంది. మార్కెట్‌లో దొరికే రకరకాల క్రీములు, లోషన్లకు బదులుగా ఆల్మండ్ ఆయిల్ వాడకం మంచి ఫలితాలనిస్తుంది. చలికాలంలో అన్ని రకాల చర్మతత్వాల వాళ్లూ దీనిని వాడవచ్చు. ముఖంతో పాటుగా చేతులు, కాళ్లకు కూడా (చలికి ఎక్స్‌పోజ్ అయ్యేంత వరకు) రాస్తుంటే మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది. చర్మం మీదున్న మచ్చలు, గీతలు వంటివి తొలగిపోతాయి.

❑ ఒక్కొక్కసారి స్నానం చేసినా, ఏ సబ్బుతో ముఖం కడిగినా తాజాగా ఉన్నట్లనిపించదు. కాలుష్యం చర్మరంధ్రాల్లో పట్టేసినప్పుడు, జిడ్డు మరీ ఎక్కుగా ఉన్నప్పుడు ఇలా ఉంటుంది. ఈ సమస్యపోయి ముఖం తాజాగా, శుభ్రంగా ఉండాలంటే బొప్పాయి గుజ్జు చక్కని మందు. మమూలుగా ప్యాక్‌కు వాడేకంటే ఎక్కువ మోతాదు గుజ్జు అవసరమవుతుంది. ముందుగా సగం గుజ్జును ముఖానికి, మెడకు పట్టించాలి. పది నిమిషాల తర్వాత తుడిచేసి ముఖానికి ఆవిరిపట్టాలి. ఆవిరి పట్టిన తరువాత మిగిలిన గుజ్జుతో ప్యాక్ వేయాలి. ఆరిన తరువాత చన్నీటితో కడగాలి.

## విశాఖ క్రైస్తవ సంఘానికో ప్రత్యేక విజ్ఞప్తి

మన దేశ క్షేమాభివృద్ధి కొరకు ప్రతి ఆదివారం ఆరాధనల్లో రెండు ప్రత్యేకమైన ప్రార్థనా విన్నపములు గుర్తుచేసుకోగలరు

1) మన దేశమంతా దేవుని గూర్చిన జ్ఞానములోనికి రావాలని
2) ప్రభువు ఇచ్చిన ఆజ్ఞ - మీరు సర్వలోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్త ప్రకటించబడాలని
3) భారతదేశ ఐకమత్యం కొరకు ప్రార్థన చేయండి – బిషప్ ఎం.ఎ.పాల్

క్రైస్తవులకు, సీనియర్ సిటిజన్స్‌కు రుణములపై ప్రత్యేక రాయితీ!

అమృతవర్షిణి

మ్యూచువల్లి ఎయిడెడ్ కో - ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్

రిజిష్టర్డ్ నెం. AMC/VSP/DCO 2012/3008 ఫోన్ : 0891-6002999

అమృత వర్షిణి మ్యాక్స్ లిమిటెడ్

సేవింగ్స్ & క్రెడిట్ సొసైటీ

మరిన్ని వివరములకు సంప్రదించండి.
ఫోన్ : 0891-6002999



డైరెక్టర్
సిహెచ్. ప్రభాకర్


☛ మెంబర్లుగా చేర్చుకోబడును.
☛ డిపాజిట్లు స్వీకరించబడును.
☛ డిపాజిట్లపై నెలసరి ఆదాయం/
☛ పెన్షన్ పొందవచ్చును.
☛ డిపాజిట్లపై, భూములపై, బంగారు ఆభరణములపై రుణాలు ఇవ్వబడును.

| కాలం | వడ్డీ (%) |
|---|---|
| 12 నెలలు | 12 % |
| 24 నెలలు | 13 % |
| 36 నెలలు | 13.5 % |
| 48 నెలలు | 14 % |
| 60 నెలలు | 15 % |

సంప్రదించండి : ఆఫీస్ : ఫ్లాట్ నెం. 401, బొచ్చా స్క్వేర్. 5వ, అంతస్తు, బిర్లా జంక్షన్, మురళీనగర్, విశాఖపట్నం. ఫోన్ : 0891-6002999



జయశాలి పి.డి.సుందర్రావు



### జయశాలి పి.డి.సుందర్రావు ముఖ్య వక్తగా...

# క్రీస్తు ప్రేమ విప్లవ ప్రభంజనం

విశాఖపట్నం : స్థానిక గురజాడ కళాక్షేత్రంలో ఈనెల 9,10,11 తేదీల్లో జయశాలి పిడి సుందర్రావు ముఖ్యవక్తగా 'క్రీస్తు ప్రేమ విప్లవ ప్రభంజనం' పేరుతో సభలు జరిగాయి. ఈ సభల్లో వారి యూనివర్సిటీకి సంబంధించిన ప్రొఫెసర్లు మొదట్లో వాక్యం చెప్పగా, ఆ తర్వాత ముఖ్య వక్తగా జయశాలి పిడియస్ రావు వాక్యాన్ని బోధించారు. బైబిలు ఎంతగొప్పదో, క్రీస్తు ప్రేమ ఎట్టిదో చెప్పారు. ఇతరులను చాలెంజ్‌లు చేయుట షరా మామూలుగానే ఈ సభల్లోనూ కొనసాగింది. వక్తల్లో ఆయన అల్లుడు జాన్సన్ విక్టర్ కూడా ఉన్నారు. జయశాలి పిడియస్‌రావు కుమారుడు ప్రసన్నబాబు ఫొటోను పోస్టర్లలో చూసిన వారు ఆయన ఈ సభల్లో ఎందుకు మాట్లాడలేదోయని చర్చలు జరుపుకున్నారు. అందుకుగల కారణాలను రకరకాలుగా ఎవరికి నచ్చినట్లు వారు అక్కడ మాట్లాడుకొనుట స్పష్టంగా కనబడింది. దీనిపై జయశాలి పిడి సుందరరావు ఏ విధంగా స్పందిస్తారో.. ఏ వివరణ ఇస్తారో వేచి చూడాల్సిందే!

# ...సాతాను విత్తిన గురుగులు!

## 1) త్రిత్వము 2) త్రియేక దేవుడు 3) ఏడేండ్ల శ్రమలు 4) యేసురక్తమే జయము; ఎ) సిలువ రక్తమే జయము బి) ప్రభువైన యేసు నామమునకు సంపూర్ణ విజయం కలుగును గాక. 5) మధ్యాకాశం 6) రెండవ రాకడ 7) జన్మపాపము

పైన మీరు చదివిన మాటలన్ని బైబిల్లో లేనివి. ఉన్నట్లే అన్పిస్తాయి. అందుక్కారణం.. వాటిని దేవునికి ఆపాధిస్తూ మునుపటి తరం బోధకులలా బోధించేసారుమరి! దేవుని గురించి బైబిల్లో వ్రాయబడని ఏమాటా మనం పలుకరాదు. సంపూర్ణ వివరాలు తదుపరి 'క్రైస్తవనాడు'ల్లో చదువగలరు. ఈలోపున మీ స్పందన రాసి విశాఖ కార్యాలయానికి పంపగలరు. **(అడ్రస్సు 1 మరియు 3వ పేజీల్లోగలదు.)** **- వాక్యాసక్తిపరుల కోరికపై బ్రదర్ వైకెయార్**



**బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను**
**పటాపంచలుగావించే.....దుర్భోధకులకు చెక్ పెట్టే....?!**
**అనేక మర్మగర్భ వాక్య సారాంశాలు సులువుగా నేర్పే...**

## 'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా '

# ప్రార్థనంటూ చిత్ర విచిత్రాలు

❑ **పేరుకే ప్రార్థన.. అందంతా దుర్లాభాపేక్షే!**

### సంపూర్ణ రాత్రి ప్రార్థన

సంపూర్ణ రాత్రి ప్రార్థన ఎందుకోసం? ఎవరికోసమో వారికే తెలియదు. అడిగితే, ఆమాత్రం తెలీదా? సంఘమేలుకోసం, విశ్వాసుల అభివృద్ధికోసమంటూ చెప్పడానికి సంకోచించరు. దానివల్ల సంఘానికెంత మేలు కల్గుతుందో తర్వాతి సంగతి. ముందుగా విశ్వాసులు అనేక చోట్ల చాలా ఇబ్బందుల నెదుర్కొంటున్నారు. కూలి నాలి చేసుకొనే విశ్వాసులు మరునాడు తమ పనులకు వెళ్లలేరు. నిద్రలేమితో శరీరానికి అనేక రుగ్మతలూ కలుగుతాయి. సేవకులు మాత్రం మరునాడు హాయిగా విశ్రాంతి తీసుకునే వెసులుబాటు కలిగుంటారు. విశ్రాంతి తీసుకుంటారు కూడా. సంపూర్ణ రాత్రి ప్రార్థనలతో ఎటొచ్చీ విశ్వాసులకే చిక్కులు. నెలంతా ప్రార్థించేందుకు అవకాశంలేనట్లు ఓ రోజు 'రాత్రంతా' నిద్రపోక చేసేది ఎంటో దానివల్ల ఎవరికి ఏమేలు కలుగుతుందో కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. విశ్వాసులకు ప్రతి దినం వీలు చిక్కినప్పుడల్లా ప్రార్థన చేయుట, బైబిలు చదువుటలోగల విశిష్టతను తెలిపితే అందరికీ మేలు కదా! అది చేయక రాత్రంతా కొన్నిచోట్ల గోలగోలగా ప్రార్థన పేరట అరుస్తుంటారు. తద్వారా ఆయా ప్రాంతాల్లో అనేకులకు ఇబ్బందులేర్పడుట, గొడవలు జరుగుటా వింటుంటాం. యేసు మనల్ని చేయమన్నది అలాగేనా? ఆలోచించాలి.

బైబిల్లో అపోస్తలులైనా, క్రీస్తునంగీకరించిన శిష్యులైనా, క్రైస్తవులనబడిరి అని వ్రాయబడిన వారైనా వాడుకచొప్పున రాత్రంతా 'ప్రార్థన' పేరట కూడుకొన్నట్లుగాని, నెలకో, వారానికో లేక సంవత్సరానికో ఓ సారి 'క్రమం తప్పక' కూడుకొన్నట్లుగా గాని వ్రాయబడిందా? ఆలోచించాలి! మరెందుకు ఈ సంపూర్ణ రాత్రి ప్రార్థనల పేరట జరుగుతున్న 'అసంపూర్ణ రాత్రి' ప్రార్థనలు?! అసలు ఓ రాత్రంతా ప్రార్థన చేసేంత 'భయభక్తులు' అవి చేసే వారికున్నాయా అని ప్రశ్నించు వారూ గలరు. ప్రభువు సువార్త చేయమన్నారు. అది చేయక సంపూర్ణ రాత్రి ప్రార్థనంటూ వారికిష్టమైన అంశాలను జొప్పించి ప్రార్థించే ప్రార్థనలు ఏం ఫలితాలిస్తాయన్న వారూ లేకపోలేదు.

ప్రభువు రాత్రి వేళల్లో ప్రార్థనచేసారు.. పగలంతా సువార్త చెప్పారు. అనేకులను స్వస్థపరచారు. అలా వీరు చేయరు. వీరు పగలంతా నిద్రలేమితో బాధపడితే సువార్తను ఇంకేం ప్రకటిస్తారంటున్నారు బైబిల్లో పట్టున్నవారు. సువార్త ప్రకటించడానికి, బైబిల్లోగల సంగతులను ఎరిగి ధ్యానించుటకు రాత్రి పగలు శ్రమించాలి. అది దేవుని ఆజ్ఞయైయున్న దంటున్నారు. అది మాని, ప్రార్థన పేరిట ఇలా చేయుట బైబిలుకు వ్యతిరేకమంటున్నారు. రాత్రంతా ప్రార్థన అన్న పేరుపెట్టి సగం రాత్రి మాత్రమే ప్రార్థన అంటూ గడిపేసే వారూ ఉన్నారు. పూర్తి రాత్రి మేల్కొని ఉండేందుకు నానా అగచాట్లూ పడేవారున్నారు. ఓ ప్రక్క నిద్రను ఆపుకోలేక, మరో ప్రక్క కునకలేక ముప్పుతిప్పలు పడేవారెందరో! ప్రార్థన పేరట కూడుకొని పనికిమాలిన చర్చలు జరిపేవారూ లేకపోలేదు. ప్రార్థనకు రాని వారిని గురించి విపరీతార్థాలు తీస్తూ మాట్లాడేవారూ ఆయా ప్రార్థనల్లో కన్పిస్తుంటారు.

అనేకచోట్ల 'సంపూర్ణ రాత్రి' పేరట జరిగే ప్రార్థనలు కేవలం ధనాపేక్షతోనే జరిగిస్తారన్న మాటలు వింటుంటాం. ప్రార్థించే రాత్రి కానుకల పేరట డబ్బు దండరు. దాని పేరున తర్వాతి దినాల్లో విశ్వాసులకు ఏదో జరిగిపోయిందని చెబుతూ దండేస్తుంటారు. మరికొందరు విదేశీయులకు ఆయా ఫోటోలు, వీడియోలు పంపుతూ వారి కోసమే రాత్రంతా ప్రార్థించామని చెబుతూ వారిని మోసగిస్తుంటారని చెప్పుకుంటుంటారు.


నిజంగా దేవుని సేవ చేయాలన్న ఆసక్తి ఉంటే బైబిలు చదివి దైవోద్దేశాలను మాత్రమే గ్రహించాలి. మనమేం చేస్తే మేలుకరంగా ఉంటామోనన్నది బైబిల్లో 'సంపూర్ణంగా' వ్రాయించారు దేవుడు. అది 'సంపూర్ణంగా' ఎరిగేందుకు రాత్రనక పగలనక శ్రమించాలి. ఆ మాటలే భావి జీవితానికి బాటలేస్తాయి. ఓ క్రమంలో నడుపుతాయి. లోకాన ఘనతనిస్తాయి. మనల్ని నిర్భీతితో జీవింపజేస్తాయి. లోకం మన గురించి చర్చించేట్లు చేస్తాయి. ఆ చర్చలే మనం చేసే మంచికి సాక్ష్యమిస్తాయి. క్రీస్తుకు 'సాక్షులను' చేస్తాయి. తద్వారా మనం దేవుని కుటుంబీకులంగా గుర్తించబడతాం. దేవుని కుటుంబీకులెలా జీవిస్తారో లోకానికి తేటతెల్లం చేయగలం. 'నరలోకం' నుంచి తుదకు 'పరలోకం' చేరగలం. అట్టి దేవుని కలిగున్నందుకు 'దేవునికి స్తోత్రము' చెబుతున్నా. బైబిల్లో మనకు అవసరమైనవన్నీ వ్రాయించారు దేవుడు. ఏది ఆయన మరవలేదు. మరుచుటకు ఆయన మతిమరపు వారు కారు. జాగ్రత్త సుమా! అందువల్ల ప్రతిదీ ఎలా చేయాలి, ఎందుకు చేయాలి, తద్వారా ఏమౌతుందన్నది బైబిల్లోగల దేవుని మాటలను పరిశోధించుట ద్వారా మాత్రమే తెలుస్తుంది. ఎవరో చేస్తున్నారని మీరేదీ చేయకండి. అలాగే ఎవరో ఏదో చెప్పారనీ చేయకండి. బైబిల్లో అలా ఉందో లేదోయని పరీక్షించండి. బైబిల్లో ఉన్నదాన్ని చదివి, గ్రహించిన తర్వాతే దాన్ని ఆచరణలో చూపండి. అప్పుడే దైవాశీర్వాదాలు పొందుట సులువు.

కొండలపై 'జంటల' ప్రార్థన

కొండలెక్కి 'జంటలు జంటలు'గా ప్రార్థించే వారూ ఉన్నారు. ఆయా జంటలు, వారి ప్రవర్తనలపై ఆయా ప్రాంతాల వారే ఎన్నో అనుమానాలను వ్యక్త పరుస్తుంటారు. కొందరైతే జుగుప్సాకరంగా మాట్లాడు కొంటుంటారు. కొన్ని చోట్ల మూడేసి లేక ఐదేసి రోజులు కొండలపైనే ఉండిపోతారట. అందువల్ల ఆ జంటలపై ఆ పరిసర ప్రాంతీయుల్లో ఎన్నో అపోహలు, అపార్థాలు తలెత్తుతున్నాయి. ఇది చాలా బాధాకరం. దాన్ని బట్టి ఇతరులు చెడుగా మాట్లాడే అవకాశం ఇస్తే, వారి వల్ల ప్రభువు నామం దూషించబడుట లేదా? ఆలోచించాలి! అన్నేసి రోజులు 'జంటలు జంటలు'గా కొండలపై 'రాత్రీ పగలూ' ఉండి వారు ప్రార్థించేదేంటి? వారేం చేస్తుంటారు? ఇదేం చోద్యం? ప్రభువు అలా చేయమన్నారా? అని విశ్వాసులతోబాటు ఇతరులు ప్రశ్నించుటా వినగలం. కొన్ని చోట్ల ఆయా జంటలు సక్రమమైనవా లేక అక్రమమైనవా అనీ ప్రశ్నిస్తుంటారు. ఇది మరీ ధౌర్భాగ్యస్థితి. ఇలాంటి జాడ్యాలు సాతాను సంబంధీకులవేగాని ప్రభువుకు సంబంధించినవి కావంటున్నారు బైబిల్లో పట్టున్నవారు. ఇలా చేసే వారిని ఓ కంట కనిపెట్టాలన్న వారూ లేకపోలేదు. అప్పుడు వారు వీరికి మరోరకంగా పట్టుబడితే? యేసునామము మరెంత దూషించబడు తుందోనన్న భయం కలుగుతోందంటున్నారు. మీరు వ్రాసింది చదివిన తర్వాతైనా వారిలో మార్పు రావాలి. అదెంత వేగంగా జరిగితే వారికంత మంచిదంటున్నారు. ఇలాంటి అనేక విషయాలపై ఎందరో నాతో అనేకరకాలుగా చర్చించారు. పాఠకులూ! ఈ విషయాల్లో మీకేమైనా సందేహముంటే వీటిపై చర్చించేవారు మీ ప్రాంతంలోనే ఎందరో ఉండొచ్చు. కావాలంటే పరీక్షించండి. ఈ వివరణపై మరిన్ని ప్రశ్నలు మీకుంటే విశాఖలోగల ప్రధాన కార్యాలయానికి వ్రాయుట మరవొద్దు. మీ ప్రార్థనా సహకారాలే మాకోబలం. అందుకు 'దేవునికి స్తోత్రము'.

# శరీరకార్యములు

- డా.జాయ్ చెరియన్
'యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్',
రాం నగర్,
(హైద్రాబాద్)



రక్షింపబడిన విశ్వాసులు శరీరకార్యములను విసర్జించి ఆత్మానుసారముగా జీవించాలి. పరిశుద్ధ గ్రంథములో ఆత్మకార్యములు ఏమిటో శరీర కార్యములు ఏమిటో స్పష్టముగా తెలియజేయ బడినవి. వాక్యమును అనుసరించి నీలో శరీరకార్యములు ఉంటే వాటిని విడిచిపెట్టి, శరీరమును దాని యిచ్ఛలతో కూడ సిలువ వేసి పరిశుద్ధాత్మతో నింపబడి ఆత్మానుసారముగా నడుచుకోవాలి.

**'నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరము ఆత్మకును ఆత్మ శరీరమునకును విరోధముగా ఆపేక్షించును. ఇవి యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవిచేయ నిచ్ఛయింతురో వాటిని చేయకుందురు. శరీరకార్యములు స్పష్టమైయున్నవి; అవేవనగా, జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, అభిచారము, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేదములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలైనవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారరము ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను. క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువవేసి యున్నారు.'**

– గలతీ 5:16,17,19–21,24

శరీరమునకు ఆత్మకును మధ్య ప్రతిదినము యుద్ధము జరుగుతూనే ఉంటుంది. ఈ నిరంతర పోరాటములో నీవు శరీరముపై విజయము పొందాలంటే పరిశుద్ధాత్మ శక్తితో నింపబడాలి. శరీరకార్యములను నెరవేర్చేవారు దేవుని రాజ్యమును స్వతంత్రించుకోలేరు; నరకపాత్రులవుతారు. శరీరకార్యములలో ఏ పాపము నీలో ఉన్నా నీ ఆత్మీయజీవితమును పాడుచేస్తుంది. కావున నీవు వీటిని తొలగించుకోవాలి.

**1) జారత్వము :** వివాహమునకు ముందు, వివాహానంతరం జరిగించే అక్రమ లైంగిక సంబంధమైన పాపములన్నీ జారత్వము క్రిందకే వస్తాయి. జారత్వము వలన కుటుంబములు పతనమైపోతాయి. జారత్వము జరిగించువాడు కేవలము బుద్ధిశూన్యుడు, తన స్వనాశనమును కోరుకొనువాడని వాక్యములో ఉంది. అనుదినము వార్తలలో అక్రమ సంబంధములు కలిగియుండి వ్యభిచారము జరిగించే వారిని గూర్చి చూస్తూనే ఉంటాము. జారత్వము నిన్ను నాశనము చేస్తుంది గనుక జారత్వమునకు దూరముగా పారిపోవాలి.

**2) అపవిత్రత :** పాపపు తలంపులు, శరీరేచ్ఛలు సహజముగా ప్రతి మానవునిలో కలుగుతూనే ఉంటాయి. వాటిని నెరవేర్చుకుంటూ పోతే నీలో అపవిత్రత చోటు చేసికుంటుంది. రక్షింపబడిన దేవుని బిడ్డలు యేసురక్త ప్రోక్షణలో శరీరేచ్ఛలను చెరపట్టి బంధించి నీ హృదయములు పవిత్రముగా కాపాడుకోవాలి.

**3) కాముకత్వము :** ఈ రోజుల్లో చూస్తే హోమోసెక్సువాలిటి, లెస్బినిజమ్ వంటి స్వలింగ సంపర్కము అనే పాపములు విస్తారముగా జరుగుతున్నాయి. ప్రజలు కామముతో కళ్లు మూసుకొని కామాంధులై వ్యభిచార పాపము చేస్తున్నారు. సొదొమ గొమొఱ్ఱలతో ప్రజలు ఈ విధమైన పాపము చేయుటవలన దేవుడు అగ్ని గంధకములతో ఆ ప్రదేశమును కాల్చివేశాడు. అది అంత భయంకరమైన పాపము. కాముకత్వమును నీ హృదయములో నుండి తొలగించుకోవాలి.

**4) విగ్రహారాధన :** విగ్రహారాధన అంటే చెక్కబడిన విగ్రహములకు సాగిలపడటము మాత్రమే కాదు గాని దేవునికన్న ఎక్కువగా వేటిని ప్రేమించినా అవి నీ హృదయములో విగ్రహాలుగా నిలిచిపోతాయి. కాబట్టి నీ పూర్ణహృదయముతో పూర్ణాత్మతో దేవునినే ప్రేమించాలి. ఆయనే పూజనీయుడు, యుగయుగములకు దేవుడైయున్నాడు.

**5) అభిచారము:** అభిచారమంటే మంత్రశక్తులను ఆశ్రయించడము. ఇట్టి పాపములను విడిచిపెట్టి సజీవుడైన జీవముగల దేవునినే ఆశ్రయించాలి. ఆయన ఎంతైన నమ్మదగిన దేవుడు. సర్వశక్తి గలిగిన దేవుడు. ఆయనకు అసాధ్యమైనది ఏదీలేదు. అందుకే దావీదు భక్తుడు దేవుడే నా ఆశ్రయము, ఉన్నత దుర్గము, రక్షణ శృంగము నా కొండ నా కోట ఆయనే అంటున్నాడు. దయ్యపు శక్తులైన మంత్ర తంత్రములు శకునములు నాశ్రయించకుండ దేవునినే ఆశ్రయించాలి.

**6) ద్వేషము :** విశ్వాసులలో ద్వేషము ఉండకూడదు. నీ హృదయం ప్రేమతో నింపబడాలి. యేసు ప్రభువు ఎవరినీ ద్వేషించలేదు. కాబట్టి నీవు ఎప్పుడూ ఎవరిమీద ద్వేషమును ఉంచుకోవద్దు. భార్య భర్తల మధ్యలో అభిప్రాయ భేదములు వచ్చి ఒకరిని నొకరు గాయపరచుకున్నా వెంటనే మరచిపోవాలి. క్షమించాలి. ఒకరినొకరు ప్రేమించుకోవాలి. పరిచర్య చేయాలి. అప్పుడే దేవుని కృప నీ పిల్లల మీద, కుటుంబము మీద ఉంటుంది. కొందరు భార్యాభర్తలు ద్వేషించుకొంటే కొన్ని సంవత్సరములు మాట్లాడుకోకుండ ఉంటారట. ద్వేషమున్న చోట దేవుని ఆత్మకార్యములు జరుగువు కాబట్టి ద్వేషము నీలోనుండి తొలగించుకోవాలి.

**7) కలహము :** ద్వేషమున్నచోట కలహము ఉంటుంది. కలహమునకు దూరముగా ఉండుట నరులకు ఘనత అని వాక్యంలో ఉంది. ఇంట్లో కలహించకూడదు. ఎవరైనా కలహిస్తే నీవు మౌనంగా ఉండి ప్రార్థించే దైవశక్తి పొందాలి. భార్యా భర్తలిద్దరు కలహిస్తే పిల్లలు ఏమైపోతారు. ఇంటి వాతావరణం అసమాధానముతో నిండిపోతుంది. అట్టి కుటుంబములపైకి దేవుని కనికరము ఎలా వస్తుంది? భర్త కలహిస్తే భార్య మౌనంగా ఉండి తగ్గించుకొని ప్రార్థించి క్షమాపణ అడిగితే దేవుని సమాధానము ఆ కుటుంబముపై దిగుతుంది. ప్రతి కుటుంబము పరలోకమునకు ప్రతిబింబముగా ఉండాలని దేవుడు ఆశిస్తున్నాడు. మాటకు మాట, దెబ్బకు దెబ్బ విశ్వాసులకు తగదు. వీటికి విశ్వాసులు దూరముగా ఉండాలి.

**8) మత్సరములు :** దేవుని బిడ్డలు ఏ వివాదములకు చోటివ్వద్దు. మత్సరమున్నచోట వివాదము, ప్రతి నీచకార్యముంటుంది. కావున నీవు వివాదములకు దూరముగా ఉండాలి.

**9) క్రోధములు :** కోపము వలన నీకు ఏ మేలు జరుగదు. నీవు కోపగించినప్పుడు నీ నరములు కండరములు బిగుసుకుంటాయి. బి.పి. ఎక్కువ అవుతుంది. నీ ముఖము వికారమయిపోతుంది. అందుకే కోపము మానుము; ఆగ్రహము విడిచిపెట్టుము; వ్యసనపడకుము అది కీడుకే కారణమని వాక్యంలో ఉంది. కాబట్టి కోపము విడిచిపెట్టి ఎల్లప్పుడు సంతోష సమాధానములతో జీవించాలి. చిన్న బిడ్డలు పోట్లాడుతారు; ఒకరినొకరు కొట్టుకుంటారు గాని మరుక్షణమే కలసిపోతారు. ఆలాగు చిన్నబిడ్డవలె నీ మనసు మారిపోవాలి.

**10) కక్షలు :** కొందరు ఎప్పుడో ఎవరో చేసిన తప్పును మనస్సులో పెట్టుకొని పగతో ప్రతీకారము తీర్చుకోవాలి. కక్ష సాధించాలనుకోవడం మంచిది కాదు. అది దైవ స్వభావమునకు విరుద్ధమైనది కాబట్టి నీలో నుండి తొలగిచుకోవాలి. అన్నిటిని వెంట వెంటనే మరచిపోవాలి. క్షమించాలి. నరుని కోపము దేవుని నీతిని నెరవేర్చదు.

**11) విమతములు :** విమతములు అంటే భిన్నాభిప్రాయములు. సాతానుడు విశ్వాసులను చెదరగొట్టుటకు నానారకములైన బోధలను వాని తంత్రములుగా వాడుతాడు. దేవుని వాక్యము ఏమి చెబుతుందో దానినే అనుసరించాలి. పరిశుద్ధాత్ముడే బోధకుడుగా, దేవుని వాక్యమే నీ బోధగా ఉండాలి. విమతములకు చెవి యొగ్గకూడదు.

**'మేము మీకు ప్రకటించిన సువార్తగాక మరియొక సువార్తను మేమైనను పరలోకమునుండి వచ్చిన యొక దూతయైనను మీకు ప్రకటించినయెడల అతడు శాపగ్రస్తుడవును గాక'.** – గలతీ 1:8

దేవుని వాక్యమునకు భిన్నముగా ఉన్న దేనినీ నమ్మకూడదు. వాక్యము నీ పాదములకు దీపముగా నీ త్రోవకు వెలుగైయున్నది. కాబట్టి దేవుని వాక్యము నుండి వైదొలగి విభిన్న బోధల తట్టు తిరుగవద్దు.

**12) భేదములు :** కొందరు ఇతరుల మధ్యలో విభేదముల పుట్టించడమే పనిగా పెట్టుకుంటారు. కుటుంబములలో, సంఘములలో భేదములు పుట్టిస్తు ఐక్యతను పాడుచేస్తారు. కుటుంబములోనైనా సంఘములోనైనా ఐక్యత ఉన్నప్పుడే దేవుని ఆశీర్వాదము, శాశ్వత జీవము ఉంటుంది. (కీర్తన 133) విభేదములు పుట్టించడము సాతాను స్వభావము కావున నీవు వీటికి దూరముగా ఉండాలి.

**13) అసూయలు :** ప్రేమ లేకుంటే ఈర్ష్య, అసూయలు చోటు చేసుకుంటాయి. ప్రేమయందు నిలిచియుండని వాడు మరణమందు నిలిచియుంటాడు. వాడు హత్య చేయుటకు కూడ వెనుకతీయడు. హృదయములోనున్న కల్మషము వానిని ఆ విధముగా నడిపిస్తుంది. నీ మాటలు, క్రియలు, ప్రవర్తన మారిపోతుంది. కాబట్టి నీ హృదయంలో నుండి అసూయను తొలగించుకొని హృదయం ప్రేమతో నింపుకోవాలి.

**14) మత్తతలు :** మద్యముతో మత్తులై యండకూడదని వాక్యం తెలియజేస్తుంది. విశ్వాసులు ఆత్మపూర్ణులై యుండాలి. విశ్వాసులు త్రాగుడుకు దూరముగా ఉండాలి. త్రాగినప్పుడు మత్తులో మునిగి వివేచన కోల్పోయి చేయరాని కార్యములు చేస్తావు; మాట్లాడకూడని మాటలు మాట్లాడుతావు. త్రాగుడు అనే బలహీనత వలన అనేక కుటుంబములు కూలిపోతున్నాయి.

**'ఎవరికి శ్రమ? ఎవరికి దు:ఖము? ఎవరికి జగడములు? ఎవరికి చింత? ఎవరికి హేతువులేని గాయములు? ఎవరికి మంద దృష్టి? ద్రాక్షారసముతో ప్రొద్దుపుచ్చువారికే గాదా, కలిపిన ద్రాక్షారసము రుచిచూడ చేరువారికే గదా. ద్రాక్షారసము మిక్కిలి ఎఱ్ఱబడగును. గిన్నెలో తళతళలాడుచుండగను త్రాగుటకు రుచిగా నుండను దానివైపు చూడకుము పిమ్మట అది సర్పమువలె కరచును. కట్లపామువలె కాటువేయును. విపరీతమైనవి నీ కన్నులకు కనబడును. నీవు వెఱ్ఱిమాటలు పలుకుదువు. నీవు నడిసముద్రమున పండుకొనువానివలె నుందువు. ఓడకొయ్య చివరను పండుకొనువానివలె నుందువు. – నన్ను కొట్టినను నాకు నొప్పి కలుగలేదు. నామీద దెబ్బలు పడినను నాకు తెలియలేదు. నేనెప్పుడు నిద్ర మేల్కొందును? మరల దాని వెదకుదును అని నీవనుకొందువు.'** – సామెతలు 23:29–35

త్రాగుబోతులు దరిద్రులవుతారు కాబట్టి త్రాగుడు అలవాటు నీలో నుంటే దానిని విడచిపెట్టాలి.

**15) అల్లరితో కూడిన ఆటపాటలు :** పెద్ద శబ్దముతో మ్యూజిక్, సినిమా పాటలు పెట్టుకొని పోకిరిచేష్టలు చేస్తు అల్లరితో కూడిన ఆటపాటలు విశ్వాసులకు తగవు. ఇటువంటి కార్యములున్న చోట దేవుని ఆత్మ ఉండాదు.

**'మనము పోకిరిచేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితో కూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహపూజలు మొదలైనవాటియందు నడుచుకొనుచు, అన్యజనుల ఇష్టము నెరవేర్చుచుండుటకు గతించిన కాలమే చాలును.'** –1 పేతురు 4:3

ఈ రోజులలో క్రైస్తవులశుభకార్యములలో పెళ్లిళ్లు, పుట్టిన రోజులలో సినిమా పాటలు, అల్లరితో కూడిన ఆటపాటలుండటము సిగ్గుచేటు. రక్షింపబడిన తరువాత అన్యజనులవలె ఉండకూడదు. ప్రాచీన స్వభావమును విడచి నవీన స్వభావము ధరించుకోవాలి. నీ జీవితములో నీ ఇష్టము కాదు దేవుని చిత్తము నెరవేర్చాలి. గొఱ్ఱె, శరీరమునకు ఏదైనా మురికి అంటితే ఏదైనా చెట్టుకుగాని గోడకుగాని దాని శరీరమును రుద్దుకుంటూ మురికిని వదిలించుకుంటుంది. అంత వరకు అది నెమ్మదిగా ఉండదు. విశ్వాసులు గొఱ్ఱెలతో పోల్చబడ్డారు. నీకు ఏదైనా అపవిత్రత, లోకమాలిన్యము అంటుకుంటే యేసు రక్తములో కడుగబడి పరిశుద్ధపరచబడాలి.

పైన పేర్కొనబడిన శరీర కార్యములలో ఏదీ విశ్వాసులలో ఉండకూడదు; ఉంటే ప్రార్థన ద్వారా తొలగించుకోవాలి. శరీర కార్యములు జరిగించేవారు దేవుని రాజ్యమునకు వారసులు కాలేరు. దేవుని ఉగ్రత అట్టివారిపైకి వస్తుంది. కాబట్టి శరీర కార్యములు జయించి ఆత్మనియమములలో నడుచుకోవాలి. దేవుని వాక్యమను ఆత్మ ఖడ్గముతో శరీర కార్యములను చంపివేయాలి. దేవునికి లోబడి యుండి దేవుని వాక్యము ఎత్తిపట్టి అపవాదిని ఎదిరించాలి. అప్పుడు వాడు నీ యొద్ద నుండి పారిపోతాడు.

**'కావున భూమిమీదనున్న మీ అవయవములను, అనగా జారత్వమును, అపవిత్రతను, కామాతురతను, దురాశను, విగ్రహారాధనయైన ధనాపేక్షను చంపి వేయుడి. వాటివలన దేవుని ఉగ్రత అవిధేయుల మీదికి వచ్చును.'** – కొలస్సీ 3:6

**'అన్యాయస్థులు దేవుని రాజ్యమునకు వారసులు కానేరరని మీకు తెలియదా? మోసపోకుడి; జారులైనను విగ్రహారాధికులైనను వ్యభిచారులైనను ఆడంగితనముగల వారైనను పురుషసంయోగులైనను దొంగలైనను లోభులైనను త్రాగుబోతులైనను దూషకులైనను దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు. మీలో కొందరు అట్టివారై యుంటిరి గాని, ప్రభువైన యేసుక్రీస్తు నామమునను మన దేవుని ఆత్మయందును మీరు కడుగబడి, పరిశుద్ధపరచబడినవారై నీతిమంతులుగా తీర్చబడితిరి."** – 1 కొరింథీ 6:6–11

ఎవరు కూడ పుట్టుకతో పవిత్రులు కారు. యేసు రక్తము చేత మనము కడుగబడి పరిశుద్ధ పరచబడ్డాము. కావున నీవు ఇక పాపము జోలికి పోకూడదు. ప్రాచీన స్వభావమును వదిలిపెట్టి నవీన స్వభావమును ధరించుకోవాలి.

**'కావున మునుపటి ప్రవర్తన విషయములోనైతే, మోసకరమైన దురాశలవలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్తవృత్తియందు నూతన పరచబడినవారై, నీతియు యథార్థమైన భక్తియుగలవారై, దేవుని పోలికగా సృష్టింపబడిన నవీనస్వభావమును ధరించుకొనవలెను.'**

– ఎఫెసీ. 4:22–24.

ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!

## ముత్యాల సరాలు | అది స్వర్గం - ఇది నరకం

అది ధగద్ధగాయమానంగా వెలుగులు విరజిమ్ముతున్న స్వర్ణ సిహాసనం. అధిష్టించినవాడు ఎవ్వనిచేజనించు జగమెవ్వని లోపల నుండు లీనమై, స్వరము తానే అయిన వాడెవ్వడో ఆ సర్వసృష్టికర్త. తీర్పుతీర్చడానికి దర్బారులో సర్వసన్నద్ధంగా ఉన్నాడు. మొదట చుట్టూరా ఉన్న ప్రజలను ఇరుపక్షాలుగా వేరుచేసాడు. కుడి ఎడమలకు విడదీశాడు. గంభీర కంఠస్వరం దశదిశల మ్రోగింది. కుడివైపు వారినుద్దేశించి అన్నాడు. "నా తండ్రి ఆశీస్సులకు అర్హులైన మిత్రులారా, రండి మీ కొరకు ఏర్పాటైన స్వర్గలోకంలో ప్రవేశించండి. ఎందుకంటే, నేను ఆకలిగొన్నప్పుడు మీరు భోజనం పెట్టారు. దాహానికి నీరిచ్చి సేదతీర్చారు. పరదేశినై వస్తే పంచనజేర్చి ఆతిధ్యమిచ్చారు. వస్త్రదానం చేసి వనరులు సమకూర్చారు. అనారోగ్యంలోనన్నాదుకొన్నారు. అపనిందపాలై చెరసాలలో శిక్షననుభవిస్తుంటే పరామర్శగా నన్ను పలకరించారు.

ఆశ్చర్యంతో అప్పుడు వారన్నారు "ప్రభూ, మేమా! మీకు అన్ని సేవలు చేశామా? అదెప్పుడు? మీకు అన్ని కష్టాలొచ్చాయా? మాకు తెలియనే తెలియదే? మీరు కష్టాలపాలు ఎందుకయ్యారు. మీకిన్ని సేవలు చేసే భాగ్యం మాకు కలిగిందా"? అందుకాయన మందహాసం చేస్తూ "దీనస్థితిలో ఉన్న నా పేద సోహోదరులు మీరు చేసిన ప్రతి సత్కార్యం నాకు చేసినట్టే" అని ఎడమవైపు ఉన్న వారితో ఇలా అన్నాడు. "వెళ్లండి దుష్టుని దూతల కోసం సిద్ధం చేసిన అగ్నిజ్వాలలో అనవరతం శ్రమననుభవించండి. నా కుడివైపు నున్నవారు చేసిన ఏ ఒక్క సత్కార్యం మీరు నాకు చెయ్యలేదు". వారప్పుడు భయక్రాంతులై "ప్రభూ, మీరేమిటి! మీకు దుస్థితేమిటి! మీకు సాయం చేయకపోవడమేమిటి!" అన్నారు. దానికాయన జవాబు : హీనస్థితిలోనున్న నిరుపేద వారికి మీరు ఏ సాయమూ చేయకపోవడం నాకు చెయ్యకపోవడమే. పాపం వారు విక్షపాలయ్యారు. మంచివారు ఆనందమయ అనంత జీవితంలోకి అడుగుపెట్టారు. ఏది స్వర్గమో ఏది నరకమో మీకీ పాటికి తెలిసి పోయి వుంటుంది.

ఉత్కంఠ భరితమైన ఈ ఉదంతం బైబిలులో భాగమైన "కొత్త నిబంధన" గ్రంథంలో ఉటంకించబడింది. ఆ రాజు రారాజైన దేవుడు. ఇరుపక్షాలవారు మానవులు. నిరురూపమైన ఇలాంటి విషయాలు కోకొల్లలుగా చెప్పాడు క్రీస్తుయేసు. అంతేకాదు ఆయన ఏది చెప్పినా ప్రతికాత్మకంగా చెప్పాడు. మంచిమాటలు చెప్పినందుకు చెడ్డవారికి కోసం వచ్చి ఆయనను సిలువ వేసి చంపారు. చంపుతున్న వారిని "వారేమి చేయుచున్నారో వారికి తెలియదు గనుక వారిని క్షమించు" మని దేవుడిని ప్రార్థించాడు. ఆయన జీవిత చరిత్ర, చేసిన ప్రబోధాలు, వాటి వ్యాఖ్యానాలు, అదే క్రొత్త నిబందన గ్రంథంలో వున్నాయి. అది 564 పుటలు గల పుస్తకం, పోస్టుకార్డు వ్రాస్తేచాలు. మీ చిరునామాకు ఉచితంగా పంపిస్తాం.

**నిరీక్షణ**

ఇదీ అడ్రసు
పోస్ట్‌బాక్స్ నెం.608,సీతమ్మధార,
విశాఖపట్నం-13.


ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!

## రెవ.డా.ఈలి మెషెక్ జార్జిరాజు
# జ్ఞాపకార్థ కూడిక దృశ్యాలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న బ్రదర్‌జాన్ సుధాకర్


బిషప్ ఎం.ఎ.పాల్


బిషప్ ఎం.మోహనరావు


రెవ.ఎం.ఆర్.జేమ్స్


రెవ.ఈ.రాయ్ థియోఫ్లస్

# 'డి' - కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం!

జూన్ 2, విశాఖపట్నం : దివంగత క్రైస్తవ నాయకులు డా.కె.డేవిడ్‌రాజు డా.కె.ఎ.పాల్‌ల మధ్య ఆస్తితగాదాలవల్ల అప్పట్లో మూతపడిన 'గమ్ ఆడిటోరియం' తిరిగి తెరుచుకుంది. ప్రస్తుతం దాని పేరును 'డి - కన్వెన్షన్ సెంటర్‌గా మార్పుజేసి ఈ నెల రెండో తేదీన ప్రారంభించారు శ్రీమతి ఎస్తేరు రాణి. దాంతోబాటే తమ మనవడైన 'కాడ్‌మన్ డేవిడ్' పుట్టినరోజునూ జరిపారు దివంగత క్రైస్తవ నాయకులు డా.కె.డేవిడ్‌రాజు శ్రీమతి ఎస్తేరు రాణి. బిషప్ ఎం.ఎ.పాల్, ఎం.ఆర్.మోహనరావు తదితరులు గ్రీటింగ్స్ చెప్పిన వారిలో ఉన్నారు. వైయంసిఎ అధ్యక్షులు రోలాండ్ విలియమ్స్ ముగింపు ప్రార్థన చేసారు. ఇకపై క్రైస్తవులు 'డి - కన్వెన్షన్ సెంటర్'ను తమ కార్యకలాపాలకు ఉపయోగించుకోవచ్చని శ్రీమతి ఎస్తేరు రాణి ప్రకటించారు.


'డి - కన్వెన్షన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న దేవిడ్‌రాజు సతీమణి ఎస్తేరురాణి


బిషప్ ఎం.ఎ.పాల్






దేవిడ్ రాజు పెద్ద కుమారుడు సాల్మన్‌రాజు

## రెమా బ్లెస్సింగ్ చర్చ్
# 'పిల్లల పండుగలు'


పాల్గొన్న పిల్లలతో రెవ.ఎం.ఆర్.జేమ్స్



తాటిచెట్లపాలెం, విశాఖపట్నం : రెమా బ్లెస్సింగ్ చర్చ్ కాపరి రెవ.ఎం.ఆర్.జేమ్స్ మరియు వారి కుటుంబీకుల ఆధ్వర్యంలో 'పిల్లల పండుగలు' జరిపారు. ప్రతీయేటా బ్రాంచి చర్చిలు, ఆ యా చర్చిల పరిసర ప్రాంతీయులందర్నీ మెయిన్ చర్చ్‌లో జరిగే పిల్లల పండుగలకు ఆహ్వానిస్తూ కార్యక్రమాల్ని నిర్వహిస్తుంటారు. ఉదయ సాయంత్రాలు పిల్లలకు రకరకాల స్కిట్స్ నేర్పుతూ వారిచే చేయిస్తూ బహుమతులు ఇస్తుంటారు.



Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 18-441/5, Laxmi Swathi Residency, 204, Santha Palem, China Gadili, Old dairy farm (Po), Visakhapatnam - 530 040, Andhra Pradesh. Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at JC Printers, China Gadili, Visakhapatnam - 40.